E KABURU - Digital News Paper
E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 08-01-2026 (వారం) గురువారం సంపుటి: 02 || సంచిక: 08|| పేజీలు–6 www.ekaburu.com



వెండికీ హాల్‌మార్కింగ్..
యోచనలో కేంద్రం
» 4లో

## నెతన్యాహు మోదీ సంభాషణ



» ఉగ్రవాదంపై ఐక్య పోరాటానికి నిర్ణయం

దిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ, ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహులు బుధవారం ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ క్రమంలో నెతన్యాహు, ఇజ్రాయెల్ దేశ ప్రజలకు మోదీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి ఇద్దరు నాయకులు తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. "నా స్నేహితుడు, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో ఫోన్‌లో మాట్లాడాను. ఆయనకు, ఇజ్రాయెల్ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడం సంతోషంగా ఉంది.

తరువాయి 2లో

# మున్సిపోల్స్



# తుది ఓటర్ల జాబితా 12న




» రిజర్వేషన్ల ఖరారు దిశగా కసరత్తు
» ఎన్నికలకు ఏర్పాట్లు ముమ్మరం

ఈకబురు, హైదరాబాద్: రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల కోసం పురపాలకశాఖ కసరత్తు ముమ్మరం చేసింది. రిజర్వేషన్లు ఖరారైన తర్వాతే నోటిఫికేషన్ విడుదల కానుంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇప్పటికే రంగంలోకి దిగడంతో పురపాలకశాఖ అధికారులు కూడా వేగం పెంచారు. జనాభా ప్రాతిపదికన వార్డులు, డివిజన్లు, ఆయా మున్సిపాల్టీలు, కార్పొరేషన్ల రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు. మొత్తం ఎన్నికల పర్వంలో రిజర్వేషన్ల ప్రక్రియ అత్యంత కీలకం కావడంతో అధికారులు దీనిని సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు. రాష్ట్రంలో గడువు ముగిసిన 117 మున్సిపాల్టీలు, 6 కార్పొరేషన్ల ఎన్నికలకు రంగం సిద్ధమైన సంగతి తెలిసిందే. ఇంకా గడువు ముగియని 4 మున్సిపాల్టీలతోపాటు జీహెచ్ఎంసీని కూడా ప్రస్తుత ఎన్నికల నుంచి మినహాయించారు. బాహ్య వలయ రహదారి పరిధిలోని మున్సిపాల్టీలను విలీనం చేయడం వల్ల జీహెచ్ఎంసీ పరిధి పెరగగా దీన్ని మూడుగా విభజించాలన్న ప్రతిపాదన నేపథ్యంలోనే ఇక్కడ కూడా ఎన్నికలు వాయిదా వేశారు. దాంతో మిగతా పట్టణ స్థానిక సంస్థల్లో తుది ఓటర్ల జాబితా సిద్ధం చేసే పని మొదలైంది. ఈ నెల ఒకటో తేదీనే ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించగా ప్రస్తుతం అభ్యంతరాల పరిశీలన పనులు నడుస్తున్నాయి. ఈనెల 12న తుది జాబితా ప్రచురించనున్నారు. 20న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతుందని భావిస్తున్నారు. ప్రభుత్వం దీనిపై ఇప్పటికే ఒక నిర్ణయం తీసుకుంది. ఎన్నికలు ఫిబ్రవరి రెండో వారంలో నిర్వహించే అవకాశం ఉంది.

తరువాయి 2లో

బీమా అనైతిక విక్రయాలకు చెక్!.. ఐఆర్‌డీఏఐ
» 4లో




కాజల్ బ్యూటీ సీక్రెట్ ఇదే.. ఆ రెండు పనులు మస్ట్!
» 5లో



## కోళ్లు, మేకలవి ప్రాణాలు కావా.. వీధికుక్కల అంశంపై సుప్రీం వ్యాఖ్యలు

వీధి కుక్కల వివాదంపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. వీధి కుక్కల రక్షణపై పెద్ద మొత్తంలో పిటిషన్‌లు దాఖలు అవుతుండడంపై అసహనం వ్యక్తం చేసింది. "అందరూ కుక్కల గురించే ఆలోచిస్తుంటే..ఇతర జంతువుల జీవితాల సంగతేంటి? కోళ్లు, మేకల గురించి ఎందుకు మాట్లాడరు?వాటివి ప్రాణాలు కావా" అని ఈ కేసులో కుక్కల రక్షణపై వాదించిన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌ను ప్రశ్నించింది. కుక్కలు కరవబోతున్నాయా లేదా అనే విషయాన్ని అవి దగ్గరకు వచ్చేంతవరకు తెలుసుకోలేమని వ్యాఖ్యానించింది. ఈ సమస్యకు చికిత్స కంటే నివారణే ముఖ్యమన్న అభిప్రాయం వ్యక్తం చేసింది.



తరువాయి 2లో




## తెలంగాణలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

తరువాయి 3 లో




## సంక్రాంతికి 6,431 ప్రత్యేక బస్సులు

తరువాయి 3లో

## హామీల అమలులో.. సీఎం విఫలం



» అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికే కేసీఆర్‌పై దుష్ప్రచారం
» భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

ఈకబురు, ఖమ్మం: నదీ జలాలు, తెలంగాణ హక్కుల గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అవగాహన లేదని.. హామీల అమలులో విఫలమైన సీఎం అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పులపాల్జేశారంటూ దుష్ప్రచారం చేస్తున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో భారాస మద్దతుతో సర్పంచులు, ఉపసర్పంచులుగా ఎన్నికైనవారితో ఆత్మీయ సమ్మేళనాన్ని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అధ్యక్షతన బుధవారం ఖమ్మంలో నిర్వహించారు. కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ''తెలంగాణ ఏర్పడినప్పుడు రూ.72 వేల కోట్ల రుణం ఉంది. కేసీఆర్ సీఎం పదవి నుంచి దిగినప్పుడు అది రూ.3.50 లక్షల కోట్లకు చేరింది. తొమ్మిదిన్నరేళ్లలో కేవలం రూ.2.80 లక్షల కోట్ల అప్పులు చేసినట్లు భాజపా ఎంపీ అడిగిన ప్రశ్నకు పార్లమెంటు వేదికగా కేంద్రమే బదులిచ్చింది. కేసీఆర్ చేసిన అప్పు కూడా రైతులు, పిల్లల భవిష్యత్తుకు పెట్టిన పెట్టుబడి. ఆ రుణంతో.. 11 సార్లు 'రైతుబంధు' సాయం అందించారు. రైతు బీమా, వ్యవసాయానికి ఉచిత కరెంటు, కల్యాణలక్ష్మి పథకాలు, రూ.22 వేల కోట్ల పంటరుణాల మాఫీ, మిషన్ భగీరథ అమలుతోపాటు గురుకుల పాఠశాలలు, కలెక్టరేట్లు, వైద్యకళాశాలలు, సీతారామ ప్రాజెక్టు నిర్మించారు. క్వార్టర్ ఫైనల్స్ లాంటి పంచాయతీ ఎన్నికల్లో మంచి ఫలితాలొచ్చాయి. కార్పొరేషన్ ఎన్నికలు సెమీఫైనల్స్. ఫైనల్స్‌లో అధిక స్థానాలు గెలుచుకొని కేసీఆర్ ముఖ్యమంత్రి కాబోతున్నారు'' అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

తరువాయి 2లో



## ఫోన్ ట్యాపింగ్ కేసులో సీఎం సోదరుడికి నోటీసులు

వాంగ్మూలం నమోదు కోసం నేడు హాజరుకావాలని కోరిన అధికారులు!

ఈ-కబురు,హైదరాబాద్ : ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దూకుడు పెంచింది. ఫోన్లు ట్యాప్ అయినవారి జాబితాలో ఉన్న దాదాపు 25 మందికి తాజాగా నోటీసులు జారీ చేసింది. ఈ విషయంలో ముందే సోషల్ మీడియాలో లీకులు రావడంపై పోలీసు ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారని సమాచారం.

» 2లో

## ఉత్తర అట్లాంటిక్ ఉద్రిక్తం

» 'రష్యా' నౌకను సీజ్ చేసిన అమెరికా
» సహకరించిన బ్రిటన్
» మరో నౌకా స్వాధీనం
» తీవ్రంగా మండిపడిన క్రెమ్లిన్
» జలాంతర్గామి, రక్షణ నౌకలను పంపేందుకు సిద్ధం!



తరువాయి 2లో

# అమరావతి కి చట్టబద్ధత కల్పించండి

» బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లు ఆమోదించండి
» నిధులు, ప్రాజెక్టులతో ఏపీని ఆదుకోండి
» 'జీ రామ్ జీ'తో రాష్ట్రంపై అదనపు భారం
» ప్రత్యామ్నాయ నిధులు ఇవ్వండి
» అమిత్ షాకు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి
» కేంద్ర క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ,
» మద్యం కేసులో జగన్ పాత్రపై చర్చ?

తరువాయి 2లో



ఈ-కబురు,న్యూఢిల్లీ, : రాజధాని అమరావతికి కేంద్రం చట్టబద్ధత కల్పించేందుకు ఈ బడ్జెట్ సమావేశాల్లోనే పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను సీఎం చంద్రబాబు కోరారు. 2024 నుంచే ఏపీకి రాజధానిగా అమరావతి నిర్ణయించాలని కోరారు. దీనివల్ల రాజధానిలో పెట్టుబడులు పెట్టే వారికి భరోసా కలుగుతుందని చెప్పారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో సీఎం సోదరుడికి నోటీసులు

మొదటి పేజీ తరువాయి



సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డికి సిట్ అధికారులు ఫోన్ చేసి గురువారం విచారణకు హాజరుకావాలని కోరినట్లు తెలుస్తోంది. 'మీ ఫోన్ ట్యాప్ అయ్యింది. దానికి సంబంధించి మీ వాంగ్మూలం నమోదు చేయాల్సి ఉంద'ని సిట్ అధికారులు కొండల్ రెడ్డితో పేర్కొన్నట్లు తెలుస్తోంది. మరోవైపు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్‌రావు తండ్రి కొండల్‌రావును బుధవారం మధ్యాహ్నం విచారణకు రావాలని వాట్సాప్‌లో నోటీసులు జారీచేశారు. సమ యం తక్కువగా ఉండటంతోపాటు తాను ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నానని, విచారణకు హాజరుకాలేనని, కావాలంటే ఇంటికొచ్చి తన వాంగ్మూలం రికార్డు చేసుకోవచ్చునని కొండల్‌రావు జవాబు ఇచ్చినట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, చిరుమర్తి లింగయ్యల కు సైతం సిట్ అధికారులు నోటీసులు జారీచేసి గురువారం విచారణకు రావాలని కోరారు. 2024 నవంబరులో వీరిద్దర్నీ విచారించి వాంగ్మూలాలు నమోదు చేశారు. వీరిద్దరూ ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టైన పోలీసు అధికారి మేకల తిరుపతన్నతో పలు మార్లు ఫోన్‌లో మాట్లాడిన నేపథ్యంలో ఏం జరిగిందనే విషయాలను తెలుసుకోవడానికి సిట్ అధికారులు అప్పట్లో నోటీసులు జారీ చేశారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు కుమారుడు సందీప్‌రావు, ప్రణీత్ ప్రణవ్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ భాగస్వాములైన నరేందర్, దినేష్ రెడ్డిలకు కూడా నోటీసులు జారీ అయ్యాయి. సందీప్‌రావుకు నోటీసు విషయంపై సోషల్ మీడియాలో ముందే లీకులు వచ్చాయి.

మొదటి పేజి తరువాయి

## అమరావతి'కి చట్టబద్ధత కల్పించండి

రానున్న కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ఆర్థిక మద్దతు ఇవ్వాలని, పలు అభివృద్ధి ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కేంద్రప్రాయోజిత పథకాల్లో రాష్ట్రానికి వాటా పెంచాలని... గృహ నిర్మాణం, రహదారులు, రైల్వే ప్రాజెక్టుల్లో ప్రాధాన్యమివ్వాలని అభ్యర్థించారు. రెవెన్యూలోటును భర్తీ చేసేందుకు కేంద్రం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బుధవారం పోలవరం పర్యటన ముగించుకున్న అనంతరం చంద్రబాబు ఢిల్లీకి చేరుకున్నారు. అమిత్‌షా నివాసంలో ఆయనతో భేటీ అయ్యారు. రాష్ట్రానికి అవసరమైన నిధులు, ప్రాజెక్టులతోపాటు రాజకీయ అంశాల పైనా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ''వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలి. రాయలసీమను హార్టికల్చర్ కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు బడ్జెట్‌లో నిధులు ఇవ్వాలి. డిసెంబరు 25న పూర్వోదయ, సాస్కీ పథకాల కింద రూ.10, 054కోట్ల మేరకు నిఉధులు ఇవ్వాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ప్రతిపాదనలు సమర్పించాం. వీటిపై సానుకూలంగా స్పందించండి. పోలవరంనల్లమలసాగర్ ప్రాజెక్టుకు మద్దతు ఇవ్వండి'' అని చంద్రబాబు కోరారు.

'ఉపాధి' మార్పులతో ప్రభావం

ఇటీవల కేంద్రం ఉపాధి హామీ పథకం స్థానంలో తెచ్చిన 'జీ రామ్ జీ'లోని కొన్ని అంశాల నుంచి రాష్ట్రానికి వెసులుబాటు కల్పించాలని అమిత్‌షాను సీఎం కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల వాటాను 60:40 నిష్పత్తికి మార్చడంవల్ల... ఇప్పటికే ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ఏపీపై మరింత ప్రభావం పడుతుందని వివరించారు. త్వరలో జరగబోయే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ గురించి చంద్రబాబుతో అమిత్ షా సూచనప్రాయంగా చర్చించినట్లు తెలిసింది. మద్యంకేసు పురోగతి, జగన్ పాత్ర గురించి కూడా వివరాలు సమర్పించినట్లు తెలుస్తోంది. గత పర్యటనలో చంద్రబాబు... అమిత్‌షాను కలవలేకపోయారు. ఈ నేపథ్యంలో... చంద్రబాబును షా ప్రత్యేకంగా ఢిల్లీకి ఆహ్వానించి చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఈ భేటీ అనంతరం చంద్రబాబు తిరిగి అమరావతికి చేరుకున్నారు



## సంక్రాంతికి 6,431 ప్రత్యేక బస్సులు

మొదటి పేజీ తరువాయి




కబురు, హైదరాబాద్: సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లేవారికోసం 6,431 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలంగాణరాష్ట్ర రోడ్డురవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) తెలిపింది. ముఖ్యంగా ఈ నెల 9, 10, 12, 13 తేదీల్లో నాలుగురోజుల పాటు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండొచ్చని అంచనా వేశామని, ఆ మేరకు సేవల్ని అందుబాటులో ఉంచనున్నట్లు వివరించింది. అదేవిధంగా తిరుగుప్రయాణంలో 18, 19 తేదీల్లో రద్దీకి తగిన ఏర్పాట్లు చేశామని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది.

హైదరాబాద్‌లో రద్దీ ప్రాంతాలైన ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్‌రోడ్స్, ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్‌రోడ్స్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి ప్రాంతాల నుంచి బస్సులు బయల్దేరతాయి.

జీవో నంబరు 16 ప్రకారం టికెట్ల ధరల్ని అదనంగా 50 శాతం వరకు పెంచుకునే అవకాశం ఉంది. ఈ సంక్రాంతి పండగకు నడిపే ప్రత్యేక బస్సుల్లోనూ అదనపు ఛార్జీలు ఉంటాయి. 9, 10, 12, 13 తేదీలతో పాటు 18, 19 తేదీల్లో మాత్రమే పెంచిన ఛార్జీలు అమలవుతాయి.

రాష్ట్ర ప్రభుత్వ మహాలక్ష్మి పథకంలో భాగంగా సంక్రాంతికి నడిపే పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు రవాణా సదుపాయం యథావిధిగా అమల్లో ఉంటుంది.

టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్‌ను www.tgsrtcbus.in వెబ్‌సైట్‌లో చేసుకోవాలని ఆర్టీసీ యాజమాన్యం తెలిపింది. ప్రత్యేక బస్సులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 04069440000, 04023450033కు సంప్రదించాలని సూచించింది.

కోళ్లు, మేకలవి ప్రాణాలు కావా

## వీధికుక్కల అంశంపై సుప్రీం వ్యాఖ్యలు



మొదటి పేజి తరువాయి

రోడ్లు, పాఠశాలల వద్ద కుక్కల వల్ల ప్రమాదాలు జరగడంపై సుప్రీం కోర్టు (Supreme Court) ఆందోళన వ్యక్తం చేసింది. విద్యాసంస్థలు, ఆస్పత్రులు, రైల్వే స్టేషన్లు తదితర ప్రదేశాల్లో కుక్కలు కరుస్తోన్న ఘటనలు పెరిగిపోతున్న నేపథ్యంలో వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేయాలని అధికారులను ఆదేశించింది. దీనిపై న్యాయవాది కపిల్ సిబల్ స్పందిస్తూ.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని దేశాల్లో కుక్కలకు టీకాలు వేయడం, స్టెరిలైజ్ చేయడం, షెల్టర్లు నిర్మించడం వంటి పద్ధతులతో వీధి కుక్కల సమస్య తగ్గుతోందని తెలిపారు. అయితే భారత్‌లో ఈ పద్ధతులను సరైన విధంగా పాటించకపోవడం, వీధుల్లో చెత్త విపరీతంగా పేరుకుపోవడంతో వీటి బెడద తీవ్రమవుతోందన్నారు.

జంతు సంక్షేమ ఎన్‌జీవో(NGO)ల తరఫున హాజరైన న్యాయవాది కాలిన్ గోన్సాల్వ్స్ వాదిస్తూ.. దేశంలో కుక్కకాట్ల సంఖ్యను ఉన్నదానికంటే ఐదు రెట్లు ఎక్కువగా ప్రభుత్వ నివేదికలు చూపుతున్నాయని ఆరోపించారు. కుక్క కాటు ఇంజెక్షన్‌ల సంఖ్యను కూడా సరైన విధంగా లెక్కించట్లేదన్నారు. 2021 నుంచి 19 రాష్ట్రాల్లో రేబిస్ కేసులు లేవన్నారు.

## మున్సిపోల్స్' తుది ఓటర్ల జాబితా 12న

మొదటి పేజీ తరువాయి



**జర్వేషన్లు ఇలా...**

2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను, రాష్ట్రంలో కులగణన కోసం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ ప్రతిపాదనల ఆధారంగా బీసీ రిజర్వేషన్లు ఖరారు చేయనున్నారు. పట్టణ స్థానిక సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ జనాభా తక్కువగా ఉంటుంది. మొత్తం జనాభాలో వీరి వాటా ప్రకారం రిజర్వేషన్లు ఖరారు చేస్తారు. ఇది పూర్తయిన తర్వాత బీసీ రిజర్వేషన్లు పూర్తిచేస్తారు. 2020లో జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 13.82 శాతం ఎస్సీలు, 3.25 శాతం ఎస్టీలు, 32.52 శాతం బీసీ జనాభా ఉన్నట్లు గుర్తించి దాని ఆధారంగానే రిజర్వేషన్లు ఖరారు చేశారు. ఎస్సీ, ఎస్టీలకు నిర్ణయించాక మిగతా వాటిని మొత్తం రిజర్వేషన్లు 50% పరిమితికి లోబడి బీసీలకు కేటాయిస్తారు. మొత్తం స్థానాల్లో 50% మహిళలకు కేటాయించనున్నారు. రిజర్వేషన్ ప్రకారం ఏ సామాజిక వర్గానికి కేటాయించినప్పటికీ అందులో సగం స్థానాలు మళ్లీ మహిళలకే దక్కుతాయి.

**ఏర్పాట్లు పూర్తి చేయాలి**

మున్సిపల్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపాల్టీ, కార్పొరేషన్ల కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 12న తుది ఓటర్ల జాబితా, 13న పోలింగ్ స్టేషన్ల వివరాల ముసాయిదా జాబితా ప్రచురించి వాటిని ఎన్నికల నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టిపోల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని కమిషనర్ ఆదేశించారు. 16న పోలింగ్ స్టేషన్ల వివరాలతోపాటు ఫొటోతో కూడిన ఓటర్ల తుది జాబితా ఆయా వార్డుల్లోని పోలింగ్ స్టేషన్ల వారీగా ప్రచురించాలని ఆమె స్పష్టం చేశారు. అవసరమైన బ్యాలెట్ బాక్సుల అంచనా, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్, జోనల్ అధికారుల నియామకానికి ఉద్యోగుల వివరాలను టిపోల్‌లో అప్‌డేట్ చేయాలని రాణి కుముదిని ఆదేశించారు.

## ఉత్తర అట్లాంటిక్ ఉద్రిక్తం



వాషింగ్టన్: ఉత్తర అట్లాంటిక్ మహా సముద్రంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రష్యా జెండాతో వెళ్తున్న వెనెజువెలా చమురు నౌకతోపాటు మరో నౌకను అమెరికా బుధవారం సీజ్ చేయడంతో కలకలం రేగింది. దీనికి బ్రిటన్ సహకరించడం అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. ఈ నౌకలపై ఆంక్షలు కొనసాగుతున్నాయి. అమెరికా చర్యపై రష్యా ఘాటుగానే స్పందించినట్లు సమాచారం. ఈ నౌకకు రక్షణగా ఒక జలాంతర్గామితోపాటు మరికొన్ని రక్షణ నౌకలను పంపేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. అమెరికా ఆధీనంలోకి తీసుకున్న రష్యా జెండాతో వెళ్తున్న నౌక పేరు మ్యారినెరా (పాత పేరు బెల్లా 1). గుయానా జెండా ఉండే ఈ నౌకకు ఇటీవలే రష్యా జెండాను అమర్చారు... అయినా ఐస్‌లాండ్ దక్షిణ తీరానికి 190 మైళ్ల దూరంలో అమెరికా దక్షిణ కమాండ్, యూరోపియన్ కమాండ్ దీనిని స్వాధీనం చేసుకున్నాయి. దీంతోపాటు ఏ దేశపు జెండా లేని మరో నౌక సోఫియాను సీజ్ చేశాయి. మ్యారినెరాపై హెలికాప్టర్ దిగుతున్న దృశ్యాలు టీవీల్లో ప్రసారమయ్యాయి. ఈ ఆపరేషన్‌కు అమెరికా, బ్రిటన్‌లు భారీ ఎత్తున బలగాలు, యుద్ధవిమానాలు, హెలికాప్టర్లను వినియోగించాయి. హెలికాప్టర్ నుంచి అమెరికా మెరీన్లు (సైనిక సిబ్బంది) నౌకపైకి దిగి.. అందులోని సిబ్బందిని అదుపులోకి తీసుకున్నారు. దానిని అమెరికా.. దక్షిణం వైపునకు మళ్లించారు. నిజానికి ఈ నౌకకు రక్షణగా రష్యా కొన్ని రోజుల కిందటే నౌకాదళాన్ని పంపినట్లు సమాచారం. అమెరికా బుధవారం దాడిచేసే సమయానికి రష్యా దళం అక్కడికి సమీపంలోనే ఉన్నట్లు సమాచారం. అయినా అమెరికా బలగాలు సమర్థంగా తమ ఆపరేషన్‌ను పూర్తి చేశాయి.

ఈ నౌకపై 2024లోనే అమెరికా ఆంక్షలు విధించింది. ఇది లెబనాన్‌లోని ఇరాన్ మద్దతున్న హెజ్‌బొల్లా మిలిటెంట్లకు ఆయుధాలను సరఫరా చేస్తోందని అప్పట్లో అమెరికా ఆరోపించింది.

ఈ రెండు నౌకలు రష్యా, ఇరాన్, వెనెజువెలా నుంచి ఆసియాలోని వినియోగ దేశాలకు చమురును సరఫరా చేస్తున్నాయని అమెరికా అంతర్గత భద్రతా వ్యవహారాలశాఖ మంత్రి క్రిస్టీ నోయమ్ తెలిపారు. వాస్తవానికి మ్యారినెరా నౌక తొలుత బెల్లా1 పేరుతో డిసెంబరు 15వ తేదీన కరీబియన్‌వైపు ప్రయాణించింది. ఆకస్మాత్తుగా అది ఉత్తరంవైపు తిరిగి ఐరోపా దిశగా ప్రయాణాన్ని ప్రారంభించింది. దీనిని స్వాధీనం చేసుకోవడానికి అమెరికా డిసెంబరులోనే సన్నాహాలు చేసింది. దీంతో ప్రమాదాన్ని గుర్తించి గుయానా జెండాను తీసేసి రష్యా జెండాను తగిలించింది. అది వెనెజువెలావైపు వెళ్తుండగా డిసెంబరులోనే స్వాధీనం చేసుకునేందుకు అమెరికా ప్రయత్నించింది. యూ28ఏ అమెరికా ప్రత్యేక ఆపరేషన్స్ విమానాలు బుధవారం స్కాట్లాండ్‌లోని జాన్ ఓ గ్రోట్స్ విమానాశ్రయంలో దిగాయి. జలాంతర్గాములను వేటాడే విమానాలు, ఇంధనం నింపే కేసీ135 విమానాలూ ఐస్‌లాండ్‌వైపు ప్రయాణించాయి. ఇవన్నీ నౌకను సీజ్ చేసే ఆపరేషన్‌లో పాల్గొన్నాయి.

## తెలంగాణలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు




మొదటి పేజీ తరువాయి

ఈకబురు,హైదరాబాద్: రాష్ట్రంలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు జరిగాయి. 20 మంది అధికారులను ఇతర ప్రదేశాలకు మారుస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వాటితో పాటు నాలుగు కమిషనరేట్ల పరిధిలోని డీసీపీలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వారి వివరాలు.. చేవేళ్ల డీసీపీగా యోగేష్, కూకట్‌పల్లి డీసీపీగా రీతిరాజ్, శేరిలింగంపల్లి డీసీపీగా చింతమనేని శ్రీనివాస్, బేగంపేట డీసీపీగా రక్షితామూర్తి, రాజేంద్రనగర్ డీసీపీగా శ్రీనివాస్, ఉప్పల్ డీసీపీగా సురేష్, సిద్ధిపేట సీపీగా రష్మి పెరుమాళ్, హైదరాబాద్ ఎస్బీ డీసీపీగా విజయ్ కుమార్‌లను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## నెతన్యాహు-మోదీ సంభాషణ



మొదటి పేజీ తరువాయి

రాబోయే కాలంలో భారత్‌ఇజ్రాయెల్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం గురించి మేము చర్చించాం. ఉగ్రవాదాన్ని మరింత దృఢ సంకల్పంతో ఎదుర్కోవాలనే మా ఉమ్మడి సంకల్పాన్ని పునరుద్ఘాటించాం'' అని మోదీ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

### కాంగ్రెస్‌లో చేరిన ఖమ్మం కార్పొరేటర్ రుద్రగాని శ్రీదేవి

హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఖమ్మం కార్పొరేటర్ రుద్రగాని శ్రీదేవి. ఆమెతో పాటు దనియాల రాధ, తోట ఉమారాణి కూడా చేరారు.



## హామీల అమలులో.. సీఎం విఫలం

ఖమ్మం జిల్లాలో ఉప ముఖ్యమంత్రి, రెవెన్యూ, వ్యవసాయశాఖ మంత్రులు ఉన్నప్పటికీ ఒక్క యూరియా బస్తా దొరకడం లేదని, రైతులు ఆందోళన చెందుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. మంత్రులు కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. 7.50 లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేయడానికి సీతారామ ప్రాజెక్టుకు కేసీఆర్ డిజైన్ చేసి 90% పనులు పూర్తిచేశారని, నేటికీ నీళ్లు ఇవ్వడం లేదన్నారు. భారాస హయాంలో పంచాయతీ ఎన్నికల్లో 10% స్థానాలను కూడా కాంగ్రెస్ మద్దతుదారులు గెలవలేదని, ఇటీవలి ఎన్నికల్లో భారాస బలపరిచినవారిలో 40% మంది సర్పంచులుగా ఎన్నికయ్యారన్నారు. మంత్రి పొంగులేటి గతంలో ప్రధాని మోదీ, అదానీలను కలిసి భాజపాలో చేరుతానంటూ కేసు లేకుండా చేయించుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఖమ్మంలో భారాస సమావేశం ఉండటంతో మంత్రి తుమ్మల కార్పొరేటర్ల ఇళ్లచుట్టూ తిరిగి వారిని వెంటబెట్టుకొని ముఖ్యమంత్రిని కలిశారని విమర్శించారు. భారాస కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరినా నష్టం లేదని.. కొత్త నాయకత్వానికి అవకాశమిస్తామన్నారు. గతంలో తుమ్మల ఓడిపోయినా.. తన మిత్రుడని కేసీఆర్ మంత్రి పదవి ఇచ్చారని, భారాస అధికారంలోకి వచ్చాక ఖమ్మం రూపురేఖలు మారితే, తన హయాంలో అభివృద్ధి జరిగినట్లుగా ఆయన ప్రచారం చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్‌లో చేరకుంటే నిధులివ్వ



మొదటి పేజి తరువాయి

# క్రీడలకు పెద్దపీట వేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం : అనీల్ కుమార్ యాదవ్

**26వ జాతీయ ఎస్ క్యూఏఐ ఛాంపియన్ విజేతలకు బహుమతులు ప్రధానం**

ఈ-కబురు, శేరిలింగంపల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందని, రాష్ట్ర క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతుందని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారబోయిన అనీల్ కుమార్ యాదవ్ తెలిపారు. గచ్చిబౌలిలోని జిఎంసి బాలయోగి స్టేడియంలో 26వ జాతీయ ఎస్ క్యూఏఐ ఛాంపియన్ షిప్ పోటీలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఎస్ క్యూఏఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు వివిధ రాష్ట్రాల నుంచి బాల,బాలికలు హాజరయ్యారు. బుధవారం ఈ ఛాంపియన్ షిప్ ఈవెంట్ కు అనీల్ కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆనీల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు పలు ప్రోత్సాహకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. నేటి యువతకు చదువు ఒక్కటే ముఖ్యం కాదని, నచ్చిన క్రీడల్లోనూ ప్రతిభ చూపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి సామల్ కార్తిక్, యువజన నాయకులు మహేందర్, మహేష్, వినోద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అనిల్ కుమార్ యాదవ్




పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులతో అనిల్ కుమార్ యాదవ్ తదితరులు

# ఈవెంట్లలో తాగి పారేసిన బాటిళ్లు సేకరించి..



స్వాధీనం చేసుకున్న లిక్కర్ బాటిళ్లు, నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

**మందు బాటిళ్లే ఫారిన్... లోపల మందంతా చీప్ లిక్కరే...**

**ఫారిన్ లిక్కర్ బాటిళ్లలో చీప్ లిక్కర్ పోసి అమ్ముతున్న ఐదుగురు అరెస్ట్**

ఈకబురు, శేరిలింగంపల్లి : ఫారిన్ లిక్కర్ బాటిళ్లంటూ ఆశపడ్డారో... అంతే సంగతులు.. ఎన్నడూ చూడని చీఫ్ లిక్కర్ టేస్ట్ చేయడం ఖాయం. ఖరీదైన బ్లూ లేబుల్, అమృత్, చివాస్ లీగల్, విలియం లాసన్, దివార్స్, టెక్విలా, గ్లెన్ ఫ్లిడ్జ్ వంటి విదేశీ మద్యం బాటిళ్లలో చీప్ లిక్కర్ మందు పోసి విదేశీ మద్యం అంటూ విక్రయిస్తున్నారు. మద్యం ప్రియులను కొత్త తరహాలో బురిడీ కొట్టిస్తున్న ఐదుగురు వ్యక్తులను శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం చందానగర్‌లోని శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శంషాబాద్ జిల్లా ఎక్సైజ్ జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారిణి కృష్ణ ప్రియ వివరాలను వెల్లడించారు. శంషాబాద్ ఎక్సైజ్ జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు, శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులతో కలిసి బుధవారం ఉదయం గచ్చిబౌలి ఇందిరానగర్ వద్ద రూట్‌వాచ్ నిర్వహించారు. ఈ సమయంలో స్కూటీపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను చెక్ చేయగా 15 నకిలీ ఫారిన్ గ్లెన్‌లివెట్ మద్యం బాటిళ్లు దొరికాయి. ఈ మద్యం బాటిళ్లు తరలిస్తున్న కేపీహెచ్‌బీకి చెందిన ప్రకాష్‌గౌడ్ (29), మాదాపూర్‌కు చెందిన భరత్ (32)లను అదుపులోకి తీసుకున్నారు. ప్రకాశ్‌గౌడ్ నివాసం ఉంటున్న రూంలో తనిఖీ చేపట్టగా 46 ఫేక్ ఫారిన్ లిక్కర్ బాటిళ్లు( బ్లూ లేబుల్, అమృత్, చివాస్ , విలియం లాసన్ , దివార్స్ , టెక్విలా, గ్లెన్‌ఫిడిచ్ ) దొరికాయి. అనంతరం ప్రకాశ్ గౌడ్ ఇచ్చిన సమాచారంతో కొండాపూర్‌లోని మృత్యుంజయ మహంతి ఇంటిపై, మాదాపూర్‌లోని విక్రమ్ భాయ్ ఇండ్లపై రైడ్ చేసి 78 ఫేక్ ఫారిన్ లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు ప్రకాశ్‌గౌడ్‌కు ఈ ఫారిన్ లిక్కర్ బాటిళ్ల దందాలో సహకరిస్తున్న అతని సోదరుడితో సహా ఐదుగురిని అరెస్ట్ చేశారు.

**ఈవెంట్లలో తాగి పారేసిన బాటిళ్లను సేకరించి...**

బీర్ కంపెనీలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్న ప్రకాష్‌గౌడ్ తనకు పరిచయం ఉన్న భరత్ , మృత్యుంజయ మహంతి, విక్రమ్ భాయ్‌లతో గ్యాంగ్‌గా ఏర్పడి ఈవెంట్‌లలో తాగి వదిలేసిన ఫారిన్ లిక్కర్ బాటిళ్లను సేకరిస్తున్నారు. ఈ బాటిళ్లలో అఫీసర్స్ చాయిస్, ఒక్‌స్మిత్ వంటి లోకల్ మందును నింపి గుర్తుపట్టకుండా సీల్ వేస్తున్నారు. అనంతరం ఈ ఫారిన్ లిక్కర్ బాటిళ్లను ఈవెంట్లలో తమకు గిఫ్ట్‌గా వచ్చాయని చెప్పి తక్కువ ధరకు మద్యం ప్రియులకు విక్రయిస్తున్నారు. దాదాపు 2 నెలలుగా ఫారిన్ లిక్కర్ బాటిళ్లలో చీప్ లిక్కర్ పోసి అమ్ముతున్నట్లు ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించారు. వీరి వద్ద నుండి రూ. 8 లక్షల విలువైన 139 ఫేక్ ఫారిన్ లిక్కర్ బాటిళ్లు, 136 ఖాళీ ఫారిన్ లిక్కర్ బాటిళ్లు, మూడు స్కూటీలను స్వాధీనం చేసుకున్నారు

# ఉర్దూ యూనివర్సిటీలో విద్యార్థుల ఆందోళన



ఆందోళన చేపడుతున్న విద్యార్థులు



ఆందోళన చేపడుతున్న విద్యార్థులు

ఈకబురు, శేరిలింగంపల్లి : గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి గంగాధర్ రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం డివిజన్ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బిజెపి శ్రేణుల ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మదిన వేడుకలకు గంగాధర్ రెడ్డి హాజరై కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. అంతకుముందు సోమవారం అర్ధరాత్రి డివిజన్ నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీ ఎత్తున గంగాధర్ రెడ్డి నివాసానికి తరలివచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గోపనపల్లిలో బిజెపి నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మదిన వేడుకలకు శేరిలింగంపల్లి నియోజకవర్గం బిజెపి ఇన్చార్జ్ రవి కుమార్ యాదవ్ హాజరై గంగాధర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. డివిజన్ పరిధిలోని నానక్‌రామ్‌గూడ, టీఎన్‌జీవోస్ కాలనీ, గౌలిదొడ్డి, మంజీరా డైమండ్ హైట్స్, అపర్ణ సైబర్ జోన్, నల్లగండ్ల విలేజ్, గోపనపల్లి, గోపనపల్లి తండా, కేశవ్ నగర్, ఖాజాగూడ, రాయదుర్గం, జీపీఆర్ఏ క్వార్టర్స్, ఎన్టీఆర్ నగర్ తదితర ప్రాంతాల్లో గంగాధర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ, తనపై ప్రజలు చూపిస్తున్న అపారమైన ప్రేమకు, నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశీర్వాదాలే తనకు శక్తి, ప్రేరణ అని, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే కార్పొరేటర్‌గా పనిచేస్తానని తెలిపారు. ప్రజల ఆశీస్సులతో కార్పొరేటర్‌గా గెలిచి ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకోవడం తనకు గర్వకారణమని అన్నారు. ఈ వేడుకలలో డివిజన్ ప్రజాప్రతినిధులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొండాపూర్ లో డ్రగ్స్ పార్టీ



**ఐదుగురిపై కేసు నమోదు**

ఈ-కబురు, శేరిలింగంపల్లి : కొండాపూర్ మజీద్ బండలోని ఓ హోటల్ గదిలో నిర్వహిస్తున్న డ్రగ్స్ పార్టీని పోలీసులు చేదించారు. డ్రగ్స్ టెస్టులు నిర్వహించగా ఐదుగురికి పాజిటివ్ రావడంతో గచ్చిబౌలి పోలీసులు ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..

నగరంలోని బేగంపేట పోలీస్ క్వార్టర్స్ లో నివాసం ఉండే తేలగొట్టి రవితేజ (28) కొండాపూర్ మజీద్ బండలో గల కోవా స్టే హోటల్ లో రూమ్ నెంబర్ 309ని అద్దెకు తీసుకున్నాడు. సదరు రూమ్ లో తన స్నేహితులు కెపిహెచ్ బీలో నివాసం ఉంటూ లెమన్ ట్రీడ్జ్ హోటల్లో మేనేజర్ గా పనిచేస్తున్న టంగుటూరి తేజేశ్వర్ రెడ్డి (28), రామంతాపూర్ కు చెందిన మెతుకుపల్లి సాయి ప్రసాద్ రెడ్డి (28), లింగంపల్లి డోయన్స్ కాలనీకి చెందిన తానికొండ రమేష్ (27), మణికొండ ఓయూ కాలనీకి చెందిన ఈవెంట్ ఆర్గనైజర్ వల్లబ్ మేగేందర్ రెడ్డి(29) లతో కలిసి డ్రగ్స్ పార్టీ నిర్వహించాడు. ఈ డ్రగ్స్ పార్టీపై సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు మంగళవారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో కోవాస్టే హోటల్ పై దాడులు నిర్వహించారు. దాడుల సందర్భంగా రవితేజతో పాటు అతని నలుగురు స్నేహితులకు డ్రగ్స్ టెస్టులు నిర్వహించగా గంజాయి పాజిటివ్ వచ్చింది. దీంతో ఐదుగురిపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# విశ్వవిద్యాలయాల్లో స్థిరాస్తి దందా: మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్: రాష్ట్రంలో చదువులకు నిలయమైన విశ్వవిద్యాలయాల్లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం స్థిరాస్తి దందా చేస్తోందని భారాస నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. విద్యా వ్యవస్థను, విశ్వవిద్యాలయాలను నిర్వీర్యం చేస్తూ భావితరాల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నారన్నారు. ఈ మేరకు బుధవారం 'ఎక్స్' వేదికగా ఆయన పోస్టు చేశారు. 'ఇటీవల ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం నుంచి బలవంతంగా 100 ఎకరాలకు పైగా భూములను లాక్కున్నారు. 60 ఏళ్లుగా ఎంతో కష్టపడి కాపాడుకుంటూ వస్తున్న ఔషధ, సుగంధ మొక్కల పరిశోధన కేంద్రంలోని 60 ఎకరాలను పూర్తిగా ధ్వంసం చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాలకు పైగా అటవీ భూమిని తాకట్టు పెట్టి విధ్వంసం చేశారు. తాజాగా మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయానికి చెందిన 50 ఎకరాలపై ప్రభుత్వం కన్నుపడింది. భవిష్యత్తు తరాలకు జ్ఞానాన్ని అందించాల్సిన చోట, ఆవిష్కరణలకు ఊపిరి పోయాల్సిన చోట ఇలా భూములను లాక్కోవడం దేనికి సంకేతం? విద్యా సంస్థల భూములను కూడా రియల్ ఎస్టేట్ వెంచర్లుగా చూస్తారా?' అంటూ హరీశ్‌రావు ప్రశ్నించారు.



# మిన్ను మెరిసేలా... మది మురిసేలా!




హైదరాబాద్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ సంక్రాంతి నేపథ్యంలో అంతర్జాతీయ పతంగుల పండగ, స్వీట్ ఫెస్టివల్, హాట్ ఎయిర్ బెలూన్, డ్రోన్ షోలను నిర్వహిస్తున్నట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. పర్యాటక రంగానికి ఆదరణ పెంచేలా 'సెలబ్రేట్ ది స్కై' పేరిట ఈ నెల 13 నుంచి 18 వరకు అట్టహాసంగా సంబురాలు జరుగుతాయని వెల్లడించారు. ఈ మేరకు బుధవారం సచివాలయంలో విలేకరులతో మంత్రి మాట్లాడుతూ... ''పర్యాటక రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు రాయితీలు కల్పిస్తున్నాం. పీపీపీ విధానంలో పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. టూరిజం కాన్‌క్లేవ్, గ్లోబల్ సమిట్ ద్వారా రూ.22,324 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు జరిగాయి. వీటి ద్వారా సుమారు 90 వేల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నాం'' అని వివరించారు. సమావేశంలో పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ క్రాంతి వల్లూరి, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ, కల్చర్ లాంగ్వేజ్ ఇండియన్ కనెక్షన్స్ (క్లిక్) సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# రాయదుర్గంలో అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం

**జొమాటో డెలివరీ బాయ్ మృతి**

**గచ్చిబౌలి, జనవరి 7 ప్రభాతవార్త : రాయదుర్గంలో అర్ధరాత్రి చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో రోడ్డు దాటుతున్న ఓ జొమాటో డెలివరీ బాయ్ మృతి చెందాడు. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం...**

నగరంలోని కాచిగూడ చప్పల్ బజార్ ప్రాంతానికి చెందిన సంజమొళ్ల కృష్ణ(35) గత రెండేళ్లుగా జొమాటో డెలివరీ బాయ్ గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా మంగళవారం అర్ధరాత్రి 1 గంట ప్రాంతంలో కృష్ణ రాయదుర్గం లోని మాల్కం చెరువు ముందు ఉన్న రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో గచ్చిబౌలి నుంచి షేక్ పేట వైపు వెళ్తున్న కారు (టీ ఎస్08 యూఎఫ్ 7297) అతివేగంగా నిర్లక్ష్యంగా వచ్చి రోడ్డు దాటుతున్న కృష్ణను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణకు తల, శరీరానికి తీవ్ర గాయాలు కావడంతో అపస్మారక స్థితికి వెళ్లాడు. కారు డ్రైవర్ అబూబకర్ వెంటనే పోలీసులు, 108కి సమాచారం అందించాడు. అనంతరం కృష్ణను స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



సంజమొళ్ల కృష్ణ (ఫైల్)

## సోలార్ రూఫ్‌టాప్‌లో
# టాటా పవర్ రికార్డు




**ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–డిసెంబర్ కాలంలో ఒక గిగావాట్ సోలార్ రూఫ్‌టాప్ ఇన్‌స్టలేషన్ల సామర్థ్యాన్ని తన సబ్సిడరీ సంస్థ 'టాటా పవర్ సోలరూఫ్' ద్వారా సాధించినట్టు టాటా పవర్ ప్రకటించింది. ఈ కాలంలో 1.7 లక్షల నివాస, వాణిజ్య, పారిశ్రామిక భవనాలపై ఎక్విప్‌మెంట్‌ను ఏర్పాటు చేసినట్టు(ఇనస్టలేషన్), అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఇన్‌స్టలేషన్లతో (38,494) పోల్చి చూస్తే 345 శాతం వృద్ధి సాధించినట్టు తెలిపింది.ఇదే కాలంలో నివాస, వాణిజ్య, పారిశ్రామిక విభాగంలో లక్ష మంది కొత్త కస్టమర్లను చేర్చుకున్నట్టు, దీంతో మొత్తం కస్టమర్ల సంఖ్య 3 లక్షలకు, ఇన్‌స్టాల్డ్ సోలార్ రూఫ్‌టాప్ సామర్థ్యం 4 గిగావాట్లకు పెరిగినట్టు వివరించింది. ఒక్క డిసెంబర్ త్రైమాసికంలోనే 58,476 రూఫ్‌టాప్ సోలార్ ఇన్‌స్టలేషన్లను సాధించినట్టు తెలిపింది. ఏప్రిల్–డిసెంబర్ కాలంలో అత్యధికంగా యూపీలో 30,857, మహారాష్ట్రలో 21,044 ఇన్‌స్టలేషన్లను చేసినట్టు పేర్కొంది. ఘర్ ఘర్ సోలార్ కార్యక్రమం ద్వారా రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ ప్రయోజనాల గురించి వినియోగదారుల్లో అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపింది.**

# కార్లు, బైక్‌లు.. బాగానే కొన్నారు..




దేశీయంగా ఆటో మొబైల్ రిటైల్ అమ్మకాల్లో మెరుగైన వృద్ధి నమోదైంది. అంతకుముందు ఏడాది(2024)తో పోలిస్తే 2025లో 8 శాతం మేర విక్రయాలు పెరిగాయి. ప్రథమార్ధమంతా మందగమనాన్ని ఎదుర్కొన్నప్పటికీ..., జీఎస్టీ 2.0 అమలు తర్వాత వాహన విక్రయాలు పరుగులు పెట్టాయని ఆటో మొబైల్ సమాఖ్య(ఫాడా) పేర్కొంది. ఇందుకు సంబంధించి గణాంకాలు విడుదల చేసింది. 2024 క్యాలెండర్ ఇయర్‌లో 2,61,45,445 యూనిట్లు అమ్ముడవ్వగా.., 2025లో 2,81,61,228 యూనిట్లు మేర అమ్ముడయ్యాయని ఫాడా తెలిపింది.

2025లో విక్రయాలు ఇలా...,

- **2024లో 40,79,532 ప్యాసింజర్ వాహనాలు అమ్ముడవగా.., 2025లో 10% వృద్ధితో 44,75,309 యూనిట్లు అమ్ముడయ్యాయి.**
- **టూవీలర్ అమ్మకాల్లో 7.24 శాతం వృద్ధి నమోదైంది. 2024లో 1,89,24,815 యూనిట్లు అమ్ముడుపోగా.. 2025లో 2,02,95,650 యూనిట్లు విక్రయమయ్యాయి.**
- **త్రిచక్ర వాహన అమ్మకాలు 2024లో 12,21,886 యూనిట్లు కాగా.. 2025లో 7.21 శాతం వృద్ధితో 13,09,953 యూనిట్లు అమ్ముడయ్యాయి. వాణిజ్య వాహన విక్రయాలు 6.71% పెరిగి 10,09,654 యూనిట్లుగా నమోదయ్యాయి. 2024లో ఇవి 9,46,190 యూనిట్లుగా ఉన్నాయి.**

"2025 ఏడాది దేశీయ ఆటో పరిశ్రమ ప్రయాణాన్ని రెండు దశలుగా అభివర్ణించవచ్చు. జనవరి నుంచి ఆగస్టు వరకు.... కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యక్ష పన్ను రాయితీలు, ఆర్‌బీఐ వడ్డీరేట్ల తగ్గింపు వంటి సానుకూలతలున్నప్పటికీ.., అమ్మకాలు స్తబ్దుగా సాగాయి. ఈ దశలో కస్టమర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తత వహించారు. అయితే సెప్టెంబర్ నుంచి పరిస్థితి మారింది. జీఎస్టీ 2.0 సవరణలో భాగంగా 350 సీసీ కన్నా తక్కువ సామర్థ్యం ఉన్న బైకులు, స్కూటర్లపై జీఎస్టీని 28% నుంచి 18 శాతానికి తగ్గించారు. అలాగే పెట్రోల్ కార్లలో 1200 సీసీ కన్నా, డీజిల్ కార్లలో 1500 సీసీ కన్నా తక్కువ వాటిపై జీఎస్టీని 28% నుంచి 18 శాతానికి తగ్గించారు. ప్రభావంతో సెప్టెంబర్ నుంచి డిసెంబర్ మధ్య కాలంలో వాహన విక్రయాలు గణనీయంగా పుంజుకున్నాయి'' అని ఫాడా అధ్యక్షుడు సీఎస్ విఘ్నేశ్వర్ తెలిపారు.

వాహన పరిశ్రమ విద్యుదీకరణ(ఎలక్ట్రిఫికేషన్)వైపు అడుగులను 2025 ఏడాది స్వాగతించిందన్నారు. టూ వీలర్స్, పీవీ, సీవీ, త్రీ వీలర్స్ ఇలా అన్ని విభాగాల్లో ఈవీ వాటా గణనీయంగా పెరిగిందన్నారు. మొత్తంగా.. 2025 క్యాలెండర్ సంవత్సరం ఉత్సాహభరితంగా ముగిసిందన్నారు. ఈ ఏడాది(2026) అవుట్‌లుపై ఫాడా వివరణ ఇస్తూ .., ''తొలి మూడు నెలల్లో రిటైల్ విక్రయాలకు ఢోకా లేదు. తాము నిర్వహించిన సర్వే ప్రకారం, 74.91% డీలర్లు వృద్ధి ఉంటుందని ఆశిస్తున్నారు. జీఎస్టీ 2.0తో కొనుగోళ్ల సామర్థ్యం పెరగడం, పండుగలు, వివాహాల సీజన్, ఆర్థిక సంవత్సరం ముగింపులో కనిపించే కొనుగోళ్ల ప్రభావం డిమాండ్‌కు మద్దతునిస్తాయని అంచనా వేసింది.

వాతావరణ శాఖ(ఐఎండీ) ముందస్తు అంచనాల ప్రకారం ఏడాది వర్షపాతం తగిన మోతాదులో ఉండొచ్చు. కావున గ్రామీణ ప్రాంతాల డిమాండ్ ఎలాగూ ఉంటుంది. స్థూల ఆర్థిక గణాంకాల దృష్ట్యా పరిశీలిస్తే... ఆర్‌బీఐ రెపో రేటు 5.25% వద్ద ఉండటం రుణ వ్యయాల విషయంలో అదనపు ఊరట లభిస్తోంది. అలాగే, వినియోగానికి పెద్దపీట వేసే విధంగా పన్ను రాయితీలకు ప్రాధాన్యం ఇచ్చే బడ్జెట్ రావొచ్చంటూ చర్చలు జరుగుతున్నాయి. అలాంటి బడ్జెట్ అమలులోకి వస్తే, డ్రిస్కేషనరీ డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉంది. సరఫరా సరైన సమయానికి సరఫరా, ఫైనాన్స్ ప్రక్రియల వేగవంతం, డీలర్ నెట్‌వర్క్‌లో క్రమబద్ధమైన నిల్వ నిర్వహణ జరిగితే..., 2026లోనూ ఆటో అమ్మకాలు టాప్‌గేర్ దూసుకెళ్లే వీలుందని ఫాడా అంచనా వేసింది.

# బీమా అనైతిక విక్రయాలకు చెక్!.. ఐఆర్‌డీఏఐ

**బీమా రంగంలో ఉత్పత్తులను తప్పుదోవ పట్టించి విక్రయించడం (అనైతిక మార్గాల్లో) ఆందోళన కలిగిస్తున్నట్టు బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌ఈఏఐ) వార్షిక నివేదిక పేర్కొంది. అసలు దీనికి గల కారణాలను గుర్తించేందుకు బీమా సంస్థలు లోతైన విశ్లేషణ చేయాలని సూచించింది.**




2023-24లో జీవిత బీమా కంపెనీలకు వ్యతిరేకంగా 1,20,726 ఫిర్యాదులు రాగా, 2024-25లోనూ ఇదే స్థాయిలో 1,20,429 ఫిర్యాదులు దాఖలైనట్టు తెలిపింది. అనైతిక వ్యాపార విధానాలపై మాత్రం ఫిర్యాదులు 23,335 నుంచి 26,667కు పెరిగినట్టు వెల్లడించింది. మొత్తం ఫిర్యాదుల్లో అనైతిక వ్యాపార పద్ధతులకు సంబంధించినవి 19.33 శాతం నుంచి 22.14 శాతానికి పెరిగినట్టు పేర్కొంది.

వ్యక్తుల అవసరాలకు సరిపడని, నియమ, నిబంధనలు, షరతులు గురించి పూర్తిగా తెలియజేయకుండా, కేవలం ప్రయోజనాల గురించే చెబుతూ పాలసీలను విక్రయించడాన్ని మిస్ సెల్లింగ్‌గా చెబుతుంటారు. బ్యాంక్‌లు, బీమా ఏజెంట్ల రూపంలో ఈ తరహా విక్రయాలు సాగుతుంటాయి. "మిస్ సెల్లింగ్‌ను నిరోధించేందుకు గాను తగిన విధానాలను అమలు చేయాలని బీమా సంస్థలకు సూచించాం. ఉత్పత్తి అనుకూలతను అంచనా వేయడం (పాలసీదారునకు అనుకూలమైనా), పంపిణీ ఛానల్ వ్యాప్తంగా కొన్ని నియంత్రణలు అమలు చేయడం, మిస్ సెల్లింగ్‌పై ఫిర్యాదుల పరిష్కారానికి ప్రణాళిక రూపొందించడం, మూల కారణాలను గుర్తించేందుకు అధ్యయనం చేయాలని సూచించడమైంది''అని ఐఆర్‌డీఏఐ తన 2024-25 నివేదికలో వివరించింది.

తప్పుడు మార్గాల్లో బీమా ఉత్పత్తుల విక్రయంపై కేంద్ర ఆర్థిక శాఖ బ్యాంక్‌లు, బీమా సంస్థలను ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూనే ఉండడం గమనార్హం. అనుకూలం కాని పాలసీలను విక్రయించడం పాలసీదారులు తర్వాత రెన్యువల్ చేసుకోరని, దాంతో పాలసీల రద్దునకు దారితీస్తున్నట్టు పేర్కొంది.

**బీమా విస్తరణ 3.7 శాతం**

**దేశంలో బీమా విస్తరణ 2024–25 సంవత్సరానికి జీడీపీలో 3.7 శాతంగా ఉన్నట్టు ఐఆర్‌డీఏఐ నివేదిక తెలిపింది. ఇది ప్రపంచ సగటు 7.3 శాతం కంటే సగమే.**

**జీవిత బీమా రంగంలో విస్తరణ రేటు 2023–24లో ఉన్న 2.8 శాతం నుంచి 2024–25లో 2.7 శాతానికి తగ్గినట్టు తెలిపింది. నాన్ లైఫ్ ఇన్సూరెన్స్ విస్తరణ రేటు మాత్రం యథాతథంగా ఒక శాతం వద్దే ఉంది.**

## మార్చి 2026 నుంచి ఏటీఎమ్‌లో
# రూ.500 నోట్లు రావా.. నిజమెంత?




**భారతదేశంలో పలుమార్లు నోట్ల రద్దు జరిగింది. అయితే ఇప్పుడు సోషల్ మీడియాలో ఒక వార్త వైరల్ అవుతోంది. ఇందులో 2026 మార్చి నుంచి ఏటీఎంల నుంచి రూ. 500 నోట్లు రావని ఉంది. దీనిపై ప్రెస్ ఇన్‌ఫర్మేషన్ బ్యూరో(PIB) ఫ్యాక్ట్ చెక్ విభాగంలో స్పందించింది.**

**రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) మార్చి 2026 నాటికి రూ. 500 నోట్ల చెలామణిని నిలిపివేస్తుందని కొన్ని సోషల్ మీడియా పోస్టులు పేర్కొంటున్నాయి. దీనిపై పీఐబీ స్పందిస్తూ.. "ఇది తప్పు అని వెల్లడించింది. రిజర్వ్ బ్యాంక్ ఇలాంటి ప్రకటన చేయలేదు. రూ. 500 నోట్లు చెలామణిలోనే ఉంటాయి. యధావిధిగా ఏటీఎంల నుంచి కూడా తీసుకోవచ్చు" అని స్పష్టం చేసింది. అంతే కాకుండా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న తప్పుడు సమాచారాన్ని ప్రజలు నమ్మవద్దని పేర్కొంది.**

**ప్రస్తుతం చెలామణిలో ఉన్న నోట్లు**

**భారతదేశంలో ప్రస్తుతం రూ. 10, రూ. 20, రూ. 50, రూ. 100, రూ. 200, రూ. 500 నోట్లు చెలామణిలో ఉన్నాయి. అయితే ఏటీఎం నుంచి రూ. 100, రూ. 200, రూ. 500 నోట్లు వస్తాయి. కొన్ని ఏటీఎంలలో కేవలం రూ. 500 నోట్లు మాత్రమే వస్తాయి. మొత్తం మీద రూ. 500 నోట్లు రద్దు కావని పీఐబీ వెల్లడించింది.**

# వెండికీ హాల్‌మార్కింగ్.. యోచనలో కేంద్రం



**బంగారాన్ని మించి వెండి (Silver) పగ్గాలు లేకుండా పరుగులు పెడుతోంది. ఇలాంటి సమయంలో వినియోగదారులు మోసాల బారినపడకుండా దానికి కూడా హాల్‌మార్కింగ్ తప్పనిసరి చేయాలని కేంద్రం యోచిస్తోంది. ఈ మేరకు భారతీయ ప్రమాణాల మండలి (బీఐఎస్) డైరెక్టర్ జనరల్ సంజయ్ గార్గ్ వెల్లడించారు.**

ప్రస్తుతం వెండికి బంగారం (Gold)లా హాల్‌మార్కింగ్ తప్పనిసరి కాదు. "వెండికి కూడా తప్పనిసరిగా హాల్‌మార్కింగ్ ఉండాలని పరిశ్రమ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. అందుకు తగ్గట్టుగా నిబంధనలు తీసుకురావడానికి ముందు అవసరమైన వనరుల గురించి అంచనా వేస్తున్నాం" అని గార్గ్ వెల్లడించారు. ప్రస్తుతం స్వచ్ఛందంగా జరుగుతోన్న హాల్‌మార్కింగ్ వ్యవస్థలో భాగంగా వెండి వస్తువులపై హాల్‌మార్క్ యూనిక్ ఐడెంటిఫికేషన్ (HUID) నంబర్ కనిపిస్తోంది. దానిద్వారా వినియోగదారులు చెల్లించిన నగదుకు తగిన స్వచ్ఛత ఆయా ఆభరణాలు, వస్తువుల్లో ఉందా అనేది నిర్ధరించుకునేందు వీలు కలుగుతోంది.

**రిలయన్స్ షేరుకు రష్యా చమురు సెగ**

ఈ మార్కింగ్ ఉన్న వెండి వస్తువుల సంఖ్య 2024లో 31 లక్షలుగా ఉండగా.. 2025లో 51 లక్షలకు చేరిందని గార్గ్ తెలిపారు. అయితే, వెండిని కరిగించి, చిన్నపాటి ఆభరణాలు తక్కువ విలువలో చేస్తుంటారని.. వీటికి హాల్‌మార్కింగ్ ధ్రువీకరణ పత్రాలు అందించడం కొంత సవాలేనని బీఐఎస్ అధికారులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు (Hallmarking to silver). వెండి ఆభరణాలకు హాల్‌మార్కింగ్‌ను 800, 835, 925, 958, 970, 990, 999 స్వచ్ఛతా ప్రమాణాలతో ఇస్తారు.

# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం మాదిరిగానే.. బుధవారం కూడా నష్టాల్లో ముగిశాయి. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి సెన్సెక్స్ 92.45 పాయింట్ల నష్టంతో.. 84,970.90 వద్ద, నిఫ్టీ 35.15 పాయింట్ల నష్టంతో 26,143.55 వద్ద నిలిచాయి.

జెహెచ్‌ఎస్ స్వెండ్‌గార్డ్ లాబొరేటరీస్ లిమిటెడ్, అప్లోదా ఇంజనీర్స్ లిమిటెడ్, ఎన్ఐబిఎల్ ఇండస్ట్రియల్ బేరింగ్స్ లిమిటెడ్, రోలటైనర్స్ లిమిటెడ్, త్రిభోవందాస్ భీమ్‌జీ జవేరి లిమిటెడ్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో నిలిచాయి. బాలు ఫోర్జ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, ఓరియంట్ టెక్నాలజీస్ లిమిటెడ్, ఇండ్‌బ్యాంక్ మర్చంట్ బ్యాంకింగ్ సర్వీసెస్ లిమిటెడ్, ఓరియంట్ సెరాటెక్ లిమిటెడ్, ఇన్‌క్రెడిబుల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ వంటి సంస్థలు నష్టాలను చవిచూశాయి.

## 2025.. నాకు చాలా ముఖ్యమైన సంవత్సరం: నాగచైతన్య




తేడాది తనకెంతో ప్రత్యేకమని నటుడు నాగ చైతన్య (Naga Chaitanya) చెప్పారు. 'తండేల్'తో తన కెరీర్ పూర్తిగా మారిపోయిందన్నారు. రూ.100కోట్ల క్లబ్‌లో చేరిన తన తొలి సినిమాగా అది ఎప్పటికీ ప్రత్యేకమన్నారు.

"2025 నాకు చాలా ముఖ్యమైన సంవత్సరం. తండేల్ రూ.100 కోట్ల క్లబ్‌లో చేరడమే కాకుండా అది ఓటీటీ డీల్‌లోనూ రికార్డులు సృష్టించింది. నా కెరీర్‌లో థియేటర్‌లో 'తండేల్', ఓటీటీలో 'దూత' ఎంతో మార్పు తెచ్చాయి. ఇప్పుడు నా 25వ చిత్రం 'వృషకర్మ'తో బిజీగా ఉన్నాను. ఇప్పటివరకూ చేయని కంటెంట్‌తో ప్రేక్షకులను పలకరించనున్నా. ఈ కొత్త సంవత్సరంలో నా లైఫ్‌లో ఎన్నో ఉత్తేజకరమైన పరిణామాలు జరగనున్నాయి. నా కుటుంబంతో కలిసి ఆ క్షణాలను ఆస్వాదించడానికి, నటుడిగా కొత్త కథలను ఎంచుకోవడానికి సిద్ధంగా ఉన్నాను. కథల ఎంపిక విషయంలోనూ జాగ్రత్త వహిస్తాను" అని నాగచైతన్య చెప్పారు.

'వృషకర్మ'లో వీఎఫ్‌ఎక్స్‌కు అధిక ప్రాధాన్యం ఉందని ఆయన చెప్పారు. తానొక నిధి అన్వేషకుడిగా, గాఢతతో కూడిన పాత్రలో కనిపించనున్నట్లు వెల్లడించారు. పురాణాల్ని, చరిత్రని మేళవించి భారీ హంగులతో రూపొందిస్తున్న చిత్రమిదన్నారు. 'కస్టడీ', 'థాంక్యూ' సినిమాలతో హిట్ కోసం ఎదురుచూసిన నాగచైతన్య.. 2023లో 'దూత'తో ఓటీటీలోకి అడుగుపెట్టి మంచి విజయాన్ని అందుకున్నారు. గతేడాది 'తండేల్' కూడా ఆయనకు హిట్‌ను అందించిన విషయం తెలిసిందే.

## కాజల్ బ్యూటీ సీక్రెట్ ఇదే..
# ఆ రెండు పనులు మస్ట్!



అందం ఆనందం.. ఆనందమే మకరందం అన్నారో మహాకవి. సినీతారలకు, ముఖ్యంగా హీరోయిన్లకు ఇది వర్తిస్తుంది. వారికి అదృష్టం, అభినయంతోపాటు తళతళ మెరిసే మేని అందం కూడా చాలా అవసరం. అది ఉంటే వయసు గురించి గుర్తుకురాదు. హీరోయిన్ కాజల్ అగర్వాల్ కూడా అదే అంటోంది.ఎందుకంటే పెళ్లి, బాబు అంటూ సంసార జీవితంలో మునిగిన కాజల్.. సినీజీవితాన్ని కూడా సమపాళ్లలో అనుభవిస్తోంది. కథానాయికగా చందమామగా అలరించినా, మగధీరతో అభినయించినా.. అందాలు ఆరబోసినా ఆమెకే చెల్లింది. పాన్ ఇండియా హీరోయిన్‌గా అలరిస్తున్న కాజల్ అగర్వాల్‌కు ఇటీవల దక్షిణాదిలో అవకాశాలు లేకపోయినా బాలీవుడ్‌లో బాగానే ఉన్నాయి. అక్కడ రామాయణం సినిమాలో మండోదరిగా నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది.అలాగే ది ఇండియా స్టోరీ అనే మరో మూవీలోనూ హీరోయిన్‌గా నటిస్తోందట! ఇప్పటికీ మిలమిల మెరిసిపోతున్న కాజల్ తన సౌందర్య రహస్యం గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడింది. ఇప్పుడు తన వయసు 40 ఏళ్లని.. సౌందర్యానికి కారణం వర్కవుట్స్, యోగా అంది. తాను నిత్యం వర్కవుట్స్ చేయడంతో పాటు మంచి పోషకాహారం తీసుకుంటానంది. ముఖ్యంగా ఆకుకూరలు, పళ్లరసాలు తీసుకుంటానని పేర్కొంది. కాయగూరల్లో ఉండే పౌష్టికాహారాలు, కొబ్బరి నీళ్లు, పళ్లరసాల్లో ఉండే ప్రకృతి సిద్ధమైన తీపి ద్వారా వెంటనే సత్ఫలితాలు అందుతాయని తెలిపింది. అందువల్ల తాను వయసు గురించి ఆలోచించనని పేర్కొంది.

## వింటేజ్ చిరంజీవిని చూస్తారు



''కామెడీ, యాక్షన్, ఎమోషన్ అన్నీ ఉన్న సినిమా 'మన శంకర వరప్రసాద్ గారు'. ఇన్నాళ్లు చిరంజీవి నుంచి ఏమైతే మిస్ అయ్యామో అవన్నీ దీంట్లో ఉంటాయి. ఇది ఆద్యంతం కడుపుబ్బా నవ్విస్తుంది'' అన్నారు నిర్మాతలు సాహు గారపాటి, సుస్మిత కొణిదెల. వాళ్లిద్దరూ సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమాలో చిరంజీవి టైటిల్ పాత్ర పోషించారు. అనిల్ రావిపూడి తెరకెక్కించారు. నయనతార కథానాయికగా నటించగా.. వెంకటేశ్ ప్రత్యేక పాత్ర పోషించారు. ఈ సినిమా సంక్రాంతి సందర్భంగా ఈనెల 12న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు నిర్మాతలు సాహు

ఆ ట్రాక్ మరోస్థాయిలో సాహు గారపాటి

''సెన్సార్ వాళ్లు సినిమా చూసి చాలా నవ్వుకున్నారు. పిల్లలతో కలిసి చూసే సినిమాలా ఉందని మెచ్చుకున్నారు. అలాగే ట్రైలర్ చూసి చిరంజీవి, వెంకటేశ్‌ల అభిమానులంతా చాలా ఎంజాయ్ చేస్తున్నారు. ఎందుకంటే తొలిసారి ఇద్దరు స్టార్స్ కలిసి నటించిన సినిమా కావడం అందరిలోనూ ఆసక్తిరేకెత్తిస్తోంది. వాళ్లిద్దరి మధ్య మంచి స్నేహం ఉండటం వల్ల చాలా ఇష్టంగా కలిసి పని చేశారు. సినిమాలో వాళ్లిద్దరి మధ్య చాలా ఫన్నీ సీన్స్ ఉన్నాయి. ఈ చిత్ర ప్రచార కార్యక్రమాల్లోనూ వాళ్లిద్దరూ కలిసి పాల్గొంటారు. అలాగే నయనతార, చిరు మధ్య సన్నివేశాలు ఎలా ఉంటాయన్నది ట్రైలర్‌లో శాంపిల్‌గా చూపించాం. ఆ భార్యాభర్తల ట్రాక్ సినిమాలో మరోస్థాయిలో అలరిస్తుంది''.

''అన్ని రకాల కమర్షియల్ హంగులతో నిండిన చిత్రమిది. చిన్నప్పటి నుంచి చిరంజీవి సినిమాలు చూస్తూ పెరిగిన వాళ్లు ఈ చిత్రం ద్వారా మరోసారి ఆ వింటేజ్ చిరును చూస్తారు. చిరంజీవి వ్యక్తిగతంగానూ ఫిట్‌నెస్‌కు చాలా ప్రాధాన్యత ఇస్తారు. ఈ సినిమా అవుట్‌డోర్ షూట్ జరిగే సమయంలోనూ రెండు పూటల జిమ్ చేసేవారు. మా సినిమా అందరి కన్నా ముందు నుంచే సంక్రాంతి రేసులో ఉంది. ఆ తర్వాత మరో రెండు మూడు సినిమాలు పండగ బరిలోకి వచ్చాయి. ఒకేసారి ఇన్ని చిత్రాలు పోటీలో ఉండటం వల్ల ప్రతి ఒక్కరికీ కొంత థియేటర్లు తగ్గుతాయి. అది అందరికీ ఇబ్బందే. కానీ, మాకైతే థియేటర్ల పరంగా వచ్చిన పెద్ద ఇబ్బందైతే ఏమీ లేదు. టికెట్ ధరలు పెంపునకు సంబంధించి రెండు తెలుగు ప్రభుత్వాలతో మాట్లాడుతున్నాం. దీనిపై ఈ రెండు రోజుల్లోనే స్పష్టత రావొచ్చు. ఈ సినిమాకి ముందు రోజే ప్రీమియర్లు ప్లాన్ చేస్తున్నాం. ఈ చిత్రానికి సీక్వెల్ చేసే ఆలోచలేమీ లేవు''.

ఇది నా కెరీర్‌కి మైలురాయి: సుస్మిత కొణిదెల

''ఇది మంచి కుటుంబ కథా చిత్రం. అసభ్యతకు తావులేకుండా మంచి వినోదంతో నిండి ఉంటుంది. నా కెరీర్‌కు మైలురాయి లాంటి సినిమా ఇది. దీంట్లో భాగమవ్వడాన్ని అదృష్టంగా భావిస్తున్నా. ఇది నాన్నకి ఎంతో ఇష్టమైన కామెడీ జానర్ సినిమా కావడం.. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించడం.. సాహు గారపాటితో కలిసి నేను నిర్మించడం.. ఈ ప్రయాణాన్ని ఆద్యంతం ఆస్వాదించా. ఈ కథలో వెంకటేశ్ పాత్రకు చాలా ప్రాధాన్యముంది. ఆయన తెరపైకి వచ్చినప్పటి నుంచి సినిమాలో వినోదం ఒక్కసారిగా రెట్టింపవుతుంది. దీంట్లో ఆయన పోషించిన పాత్రకు.. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలో చేసిన పాత్రకు ఏ పోలిక ఉండదు''.

''ఈ చిత్ర టీజర్, ట్రైలర్‌లలో నాన్నని చూసిన వాళ్లంతా.. 30ఏళ్ల క్రితం 'రౌడీ అల్లుడు'లో చిరంజీవిని చూసినట్లుందని మెచ్చుకుంటున్నారు. ఈ కథ నాన్నకి బాగా నచ్చడంతో.. ఈ సినిమా కోసం ఆయన ఓ కొత్త మీటర్ పట్టుకున్నారు. కొత్తదనం నిండిన నటనతో తెరపై చాలా ఫ్రెష్‌గా కనిపిస్తారు. దీంట్లో తన లుక్ కోసం నాన్న కఠిన కసరత్తులు చేశారు. గతంతో పోలిస్తే ఫిట్‌నెస్ చాలా పెంచారు. ఫలితంగానే తెరపై ఓ స్పెషల్ లుక్‌లో కనిపిస్తున్నారు. అందుకే మేము కూడా ఆయన ఫిట్‌నెస్‌కు తగ్గ డ్రెస్‌లే వేయాలి.. అవి ఇప్పటి కల్ట్ యువతరానికీ నచ్చేలా ఉండాలని కాస్ట్యూమ్స్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. అనిల్ రావిపూడి కూడా తను నాన్నని ఎలా చూడాలనుకుంటున్నారో స్పష్టంగా చెప్పారు. దానివల్ల ఆయనకు స్టైలింగ్ చేయడం మాకు తేలికైంది''.

## పెళ్లి చేసుకుంటానని చెప్తోన్న బ్యూటీ.. ఎప్పుడో మరి!

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ శ్రద్ధా కపూర్‌కు 38 ఏళ్లు. ఇప్పటికీ తన ఫోకస్ అంతా సినిమాలపైనే తప్ప పెళ్లిగురించి ఆలోచించడమే లేదు. అయితే కొంతకాలంగా రచయిత రాహుల్ మోదీతో ప్రేమాయణం నడుపుతోంది. తాజాగా తన పెళ్లి గురించి స్పందించింది.

**పెళ్లి చేసుకుంటా**

సోషల్ మీడియాలో జ్యువెలరీ బ్రాండ్ ప్రమోషన్స్ చేసింది శ్రద్ధా కపూర్. ఈ మేరకు ఓ యాడ్ వీడియో పోస్ట్ చేసింది. అందులో లవ్ బ్రేకప్ గురించి మాట్లాడింది. ఇది చూసిన నెటిజన్లు.. మీ పెళ్లి సంగతేంటి? అని ప్రశ్నిస్తున్నారు. దానికి హీరోయిన్ స్పందిస్తూ... నేను కూడా పెళ్లి చేసుకుంటా అని రిప్లై ఇచ్చింది. అది చూసి ఆశ్చర్యపోయిన అభిమానులు.. పెళ్లెప్పుడు? అని ఆరా తీస్తున్నారు.

**సినిమా**

శ్రద్ధా సినిమాల విషయానికి వస్తే.. ఈమె చివరగా స్త్రీ 2 సినిమాలో నటించింది. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం శ్రద్ధా.. తుంబాడ్ సినిమా ప్రీక్వెల్ పహడ్‌పాంగిర మూవలో నటిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే స్త్రీ 3, భేడియా 2 మూవీస్‌లోనూ యాక్ట్ చేయనుంది. ప్రస్తుతం ఈతా సినిమాలో యాక్ట్ చేస్తోంది.



## రూ.కోట్లు కొల్లగొడుతోన్న 'ధురంధర్'.. మరో రికార్డు సొంతం



ఎలాంటి హడావిడి లేకుండా ప్రేక్షకుల ముందుకొచ్చిన 'ధురంధర్' (Dhurandhar) భారీ విజయాన్ని అందుకుంది. విడుదలైన నాటి నుంచి విమర్శకుల ప్రశంసలు అందుకుంటూ రికార్డులు సృష్టిస్తోన్న ఈ చిత్రం ఇప్పుడు మరో మైలురాయిని అందుకుంది. ఒక భాషలో మాత్రమే విడుదలై దేశవ్యాప్తంగా అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణసంస్థ ఓ పోస్ట్ పెట్టింది.

''ఇవి భారతీయ సినిమాలో ఎప్పటికీ గుర్తుండిపోయే క్షణాలు. అత్యధిక వసూళ్లు సాధించిన సింగిల్ లాంగ్వేజ్ చిత్రంగా 'ధురంధర్' చరిత్ర సృష్టించింది. దర్శకుడు ఆదిత్యధర్‌తో పాటు చిత్రంలో భాగమైన వారందరికీ అభినందనలు. ఆదిత్యధర్‌కు కథపై ఉన్న నమ్మకం ఆయన కథను స్పష్టంగా చెప్పిన విధానం అచంచలమైన నిబద్ధత భారతీయ సినిమాకు కొత్త ప్రమాణాన్ని నిర్దేశించాయి. 'ధురంధర్' రానున్న ఎన్నో సినిమాలకు స్ఫూర్తినిస్తుంది'' అని తన పోస్ట్‌లో నిర్మాణసంస్థ రాసుకొచ్చింది (Dhurandhar Record).

నెల రోజుల్లోనే 'ధురంధర్' ఇండియాలో రూ.831.40 కోట్లు వసూలు చేసింది. భారతీయ చలన చిత్ర చరిత్రలో సింగిల్ లాంగ్వేజ్‌లో మాత్రమే విడుదలై ఈ స్థాయి వసూళ్లు సాధించిన తొలి చిత్రంగా రికార్డు నెలకొల్పింది. ఈ ఘనతను 30 రోజుల్లోనే సాధించి అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. తొలి రోజున భారతీయ బాక్సాఫీసు దగ్గర రూ.28.60 కోట్లు మాత్రమే వసూలు చేసిన ఈ సినిమా.. నెమ్మదిగా ఊపందుకుని తొలి వారం ముగిసేసరికి రూ.218 కోట్ల మార్కును అందుకోగా.. రెండో వారం పూర్తయ్యేసరికి రూ.479.50 కోట్లతో అదరగొట్టింది. 15వ రోజుకే రూ.500 కోట్ల వసూళ్లు అందుకుంది. ఇప్పుడు నెల రోజులైనా ఇంకా ఆ జోరు కొనసాగిస్తూ.. 32వ రోజు రూ.5.40కోట్లు, 33వ రోజు రూ.5.70 కోట్లు వసూలు చేసినట్లు చిత్రబృందం తెలిపింది. ఇక ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా ఇప్పటివరకూ రూ.1,220 కోట్లు తన ఖాతాలో వేసుకుంది.

## సమంత ఈజ్ బ్యాక్.. సంక్రాంతికి సడన్ సర్‌ప్రైజ్

సమంత అభిమానులు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తోన్న చిత్రం 'మా ఇంటి బంగారం' (Maa Inti Bangaram). దర్శకురాలు మినహా ఇప్పటివరకూ ఎవరూ ఈ సినిమా గురించి ఎలాంటి అప్‌డేట్ ఇవ్వలేదు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన అప్‌డేట్‌ను సామ్ షేర్ చేశారు. ఈ సంక్రాంతికి టీజర్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను పంచుకున్న సమంత (Samantha).. ఆసక్తికర క్యాప్షన్ పెట్టారు. ''మీరు చూస్తా ఉండండి.. మా ఇంటి బంగారం మీ అందరితో కలిసిపోతుంది'' రాశారు. జనవరి 9న ఈ మూవీ టీజర్‌ను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. దీంతో అభిమానులు సంబర పడుతున్నారు. 'క్వీన్ ఈజ్ బ్యాక్' అని కామెంట్స్ చేస్తున్నారు.

'ఓ బేబీ' తర్వాత సమంత (Samantha Ruth Prabhu) దర్శకురాలు నందిని రెడ్డి (Nandini Reddy) కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'మా ఇంటి బంగారం' (Maa Inti Bangaram). గతేడాది అక్టోబర్ 2న దీని షూటింగ్‌ను ప్రారంభించారు. తన సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై సమంత నిర్మిస్తున్న రెండో చిత్రమిది. దర్శకుడు రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరి సహ నిర్మాతలు. 1980ల నేపథ్యంలో సాగే క్రైమ్ థ్రిల్లర్ కథతో రూపొందుతున్నట్లు సమాచారం. ఇందులో సమంతతో పాటు బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్య కీలకపాత్రలో నటిస్తున్నారు. దీనితో పాటు సమంత ప్రస్తుతం 'రక్త్ బ్రహ్మండ్: ది బ్లడీ కింగ్‌డమ్' (Rakht Brahmand)లో నటిస్తున్నారు. దర్శకద్వయం రాజ్, డీకే (Raj and DK) దీన్ని తెరకెక్కిస్తున్నారు. ఆదిత్యరాయ్ కపూర్, అలీ ఫజల్ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. పీరియాడిక్ డ్రామాగా ఇది రూపొందుతోంది.



## సింధు శ్రమించి...



కౌలాలంపూర్: గాయం నుంచి కోలుకొని కొత్త సీజన్‌లో తొలి టోర్నీ ఆడుతున్న భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు గెలుపు బోణీ చేసింది. మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీలో సింధు ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 18వ ర్యాంకర్ సింధు 21-14, 22-20తో సుంగ్ షువో యున్ (చైనీస్ తైపీ)పై విజయం సాధించింది.

51 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రెండు గేముల్లోనూ ఒకదశలో వెనుకబడ్డ ఆంధ్రప్రదేశ్ షట్లర్ ఆ తర్వాత తేరుకోవడం గమనార్హం. తొలి గేమ్‌లో 6-9తో వెనుకబడ్డ దశలో సింధు ఒక్కసారిగా చెలరేగి వరుసగా 10 పాయింట్లు గెలిచి 16-9తో ఆధిక్యంలోకి దూసుకొచ్చింది. అదే జోరులో తొలి గేమ్‌ను దక్కించుకుంది. రెండో గేమ్ ఆరంభంలో 3-5తో వెనుకబడ్డ సింధు ఆ తర్వాత కోలుకొని 15-11తో ఆధిక్యంలోకి వచ్చింది. ఈ తరుణంలో సుంగ్ షువో వరుసగా నాలుగు పాయింట్లు నెగ్గి స్కోరును 15-15తో సమం చేసింది. ఆ తర్వాత స్కోరు 20-20 వద్ద సింధు వరుసగా రెండు పాయింట్లు నెగ్గి గేమ్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. నేడు జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 9వ ర్యాంకర్ టొమోకా మియజాకి (జపాన్)తో సింధు తలపడుతుంది. ముఖాముఖి రికార్డులో ఇద్దరు 1-1తో సమంగా ఉన్నారు.

**సాత్విక్-చిరాగ్ జంట శుభారంభం**

పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ శుభారంభం చేయగా... హరిహరన్-అర్జున్ (భారత్) ద్వయం తొలి రౌండ్‌లోనే వెనుదిరిగింది. సాత్విక్-చిరాగ్ జంట 21-13, 21-15తో లీ జె హుయ్-యాంగ్ పో సువాన్ (చైనీస్ తైపీ) జోడీపై గెలిచింది. హరిహరన్-అర్జున్ జంట 10-21, 20-22తో హిరోకి మిదోరికావా-క్యోహీ యామ□□టా (జపాన్) ద్వయం చేతిలో ఓడిపోయింది.

మహిళల డబుల్స్‌లో భారత జోడీల కథ ముగిసింది. పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ... కవిప్రియ సెల్వం-సిమ్రన్... రుతుపర్ణ-శ్వేతా పర్ణ పాండా జోడీలు తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాయి. గాయత్రి-ట్రెసా 9-21, 23-21, 19-21తో ఫెబ్రియానా కుసుమ-మెలీసా (ఇండోనేసియా) చేతిలో... కవిప్రియ-సిమ్రన్ 12-21, 11-21తో యుకీ ఫకుషిమా-మయు మత్సుమోతో (జపాన్) చేతిలో... రుతుపర్ణ-శ్వేతాపర్ణ 11-21, 9-21తో టాన్ పియర్లీ-థినా మురళీధరన్ (మలేసియా) చేతిలో ఓటమి పాలయ్యారు.

**రుత్విక-రోహన్ జోడీ అవుట్**

మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలోనూ భారత జోడీల పోరాటం ముగిసింది. తెలంగాణ అమ్మాయి గద్దె రుత్విక శివాని-రోహన్ కపూర్ (భారత్)... అమృత-అశిత్ సూర్య... తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల జంటలు తొలి రౌండ్‌లోనే వెనుదిరిగాయి. రుత్విక-రోహన్ 10-21, 17-21తో జియాంగ్ జెన్ బాంగ్-వె యా జిన్ (చైనా) చేతిలో... అమృత-అశిత్ 11-21, 9-21తో ఫువానత్-బెన్‌యాప (థాయ్‌లాండ్) చేతిలో... తనీషా-ధ్రువ్ 15-21, 21-18, 15-21తో ప్రెస్లీ-జెనీ గాయ్ (అమెరికా) చేతిలో పరాజయం పాలయ్యారు.

# శతక్కొట్టిన సూర్యవంశీ, ఆరోన్







బెనోని: ఫార్మాట్ మారినా, టోర్నీ మారినా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఆటతీరులో మాత్రం మార్పు లేదు. అతడి పరుగుల ప్రవాహం ఆగట్లేదు. వరుస సెంచరీలతో చెలరేగుతున్న అతడు.. దక్షిణాఫ్రికాతో అండర్ 19 వన్డే సిరీస్‌లో మరో విధ్వంసక ఇన్నింగ్స్ ఆడాడు. బుధవారం మూడో యూత్ వన్డేలో కెప్టెన్ సూర్యవంశీ (127; 74 బంతుల్లో 9×4, 10×6)కి తోడు మరో ఓపెనర్ ఆరోన్ జార్జ్ (118; 106 బంతుల్లో 16×4) కూడా మెరుపు శతకం బాదడంతో భారత్ 233 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించి, సిరీస్‌ను 30తో క్లీన్‌స్వీప్ చేసింది. మొదట భారత్ 7 వికెట్లకు 393 పరుగులు చేసింది. ఇన్నింగ్స్ ఆరంభం నుంచి ఫోర్లు సిక్సర్లతో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడిన వైభవ్, జార్జ్ ద్వయం తొలి వికెట్‌కు 25.4 ఓవర్లలో 227 పరుగుల పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో ఎన్‌టాండో సోని (3/61) జేసన్ రోల్స్ (2/59) మినహా బౌలర్లంతా పరుగులు ఇచ్చుకోవడంలో పోటీపడ్డారు. 63 బంతుల్లోనే సెంచరీ అందుకున్న వైభవ్.. మరింత వేగంగా ఆడే ప్రయత్నంలో ఔటయ్యాడు. అతడు వెనుదిరిగాక పరుగుల వేగం కాస్త తగ్గింది. భారీ లక్ష్య ఛేదనలో సఫారీ జట్టు చతికిలపడింది. 35 ఓవర్లలో 160 పరుగులకే కుప్పకూలింది. డానియల్ బోస్మన్ (40), పాల్ జేమ్స్ (41), కార్న్ బోథా (36) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. కిషన్ సింగ్ (3/13) మొహమ్మద్ ఎనాన్ (2/36) విజృంభించారు. వైభవ్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్', 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్' అవార్డులను సొంతం చేసుకున్నాడు.

## ఆ ఘనత డబ్ల్యూపీఎల్, ముంబయి ఇండియన్స్‌దే

ముంబయి: తనలో గెలుపు మనస్తత్వాన్ని పెంపొందించిన ఘనత మహిళల ప్రిమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్), ముంబయి ఇండియన్స్‌దేనని భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తెలిపింది. మహిళల వన్డే ప్రపంచకప్ విజయానికి ఇదెంతో తోడ్పడిందని హర్మన్ చెప్పింది. డబ్ల్యూపీఎల్‌లో ముంబయికి హర్మన్ రెండు టైటిళ్లు అందించింది. "డబ్ల్యూపీఎల్ నాలో చాలా మార్పులు తీసుకొచ్చింది. ముఖ్యంగా ఆలోచన విధానం ఎంతగానో మారింది. అంతకుముందు కొన్ని పరిమితులు ఉండేవి. ముంబయి ఇండియన్స్‌తో కలిసి పనిచేసిన తర్వాత నా దృక్పథం మారిపోయింది. ఐపీఎల్‌లో ముంబయి నిలకడగా టైటిళ్లు సాధిస్తోంది. ఆ గెలుపు మనస్తత్వం నాలోనూ వచ్చింది. కేవలం పోటీపడటం వల్ల ఎలాంటి ఉపయోగం లేదు. ఎక్కడికి వెళ్లినా.. విజయం గురించే ఆలోచించాలని నమ్ముతా. ఎలాగైనా విజయం సాధించాలన్న మనస్తత్వంతో ఆడితే ఎన్నో విజయాలు సొంతం చేసుకోవచ్చు" అని హర్మన్ వివరించింది.





## ఆధిక్యంలో ఆనంద్

**కోల్‌కతా: వయసు పెరిగినా వన్నె తగ్గని విశ్వనాథన్ ఆనంద్.. టాటా స్టీల్ చెస్ టోర్నీలో సత్తా చాటుతున్నాడు. ఆరేళ్ల తర్వాత ఈ టోర్నీలో బరిలోకి దిగిన 56 ఆనంద్.. ర్యాపిడ్ విభాగంలో మూడు రౌండ్లు ముగిసేసరికి హన్స్ నీమన్ (అమెరికా)తో కలిసి ఉమ్మడిగా ఆధిక్యంలో నిలిచాడు. వీళ్లిద్దరూ రెండు విజయాలు, ఓ డ్రాతో 2.5 పాయింట్ల చొప్పన సాధించారు. అయిదుసార్లు ప్రపంచ ఛాంపియన్ ఆనంద్.. తొలి రౌండ్లో అమెరికా క్రీడాకారుడు వెస్లీ సోను ఓడించాడు. తర్వాత వీ యి (చైనా)తో గేమ్‌ను డ్రా చేసుకుని, మూడో రౌండ్లో భారత క్రీడాకారుడు అరవింద్ చిందబరంపై విజయం సాధించాడు. తెలంగాణ క్రీడాకారుడు అర్జున్ ఇరిగేశి ఒక విజయం, ఒక ఓటమి, ఒక డ్రాతో 1.5 పాయింట్లు సాధించాడు.**

# తెగిడిన నోళ్లే.. పొగిడేలా!




**కొన్నేళ్ల ముందు ఐపీఎల్ తరహాలోనే మహిళల కోసం బీసీసీఐ ఒక లీగ్ మొదలుపెట్టాలని చూస్తోందని వార్తలు వచ్చినపుడు.. అది ఏమాత్రం విజయవంతం అవుతుందో అని సందేహించిన వాళ్లే ఎక్కువమంది. బీసీసీఐకి డబ్బులు ఎక్కువై ఇలా చేస్తోందని.. అమ్మాయిల ఆట చూడడానికి ఎవరు వస్తారనే వ్యాఖ్యానాలు చేసిన వాళ్లూ లేకపోలేదు!**

**కానీ ఇప్పుడు అమ్మాయిలు ఆడుతుంటే స్టేడియాలు నిండుతున్నాయి. వాళ్ల కోసం పెట్టిన లీగ్ అద్భుత ఫలితాలను అందిస్తోంది. ఆ లీగ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరోసారి స్టేడియాలు నిండిపోవడం ఖాయంగా కనిపిస్తోంది! ఒకప్పుడు తెగిడిన నోళ్లే ఇప్పుడు పొగిడేలా.. ఇంతింతై అన్నట్లు ఎదుగుతోంది మహిళల ప్రిమియర్ లీగ్!**

భారత క్రికెట్లో ఐపీఎల్ ఎంత గొప్ప మార్పు తెచ్చిందో తెలిసిందే. దేశంలో వందల మంది యువ క్రికెటర్లు ప్రతిభ చాటుకోవడానికి ఈ లీగ్ వేదికగా నిలిచింది. అందులో పదుల సంఖ్యలో యువ ఆటగాళ్లు భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. ఎంతోమంది స్టార్లుగానూ ఎదిగారు. అంతర్జాతీయ క్రికెటర్లతో డ్రెస్సింగ్ రూంను పంచుకోవడం, వారితో పోటీపడడం క్రికెటర్ల ఆత్మవిశ్వాసాన్ని ఎంతో పెంచింది. ఇప్పుడు వైభవ్ సూర్య వంశీ లాంటి చిన్న కుర్రాడు కూడా అదురు బెదురు లేకుండా ఆడుతున్నాడంటే దీని వెనుక ఐపీఎల్ పాత్ర ఎంతో కీలకం. మహిళల క్రికెట్లో కూడా డబ్ల్యూపీఎల్ ఇలాంటి సానుకూల మార్పునే తీసుకొచ్చింది. రిచా ఘోష్ సహా పలువురు యువ క్రికెటర్లను ఈ లీగ్ వెలుగులోకి తెచ్చింది. ఒకప్పుడు కూడా భారత జట్టులో ప్రతిభావంతులు ఉన్నా.. ఆత్మవిశ్వాస లోపం వెంటాడేది. ఆటలో దూకుడు తక్కువగా ఉండేది. కాబట్టే అంతర్జాతీయ క్రికెట్లో నిలకడగా విజయాలు సాధించలేకపోయేది. ఐసీసీ ఈవెంట్లలో కీలక దశల్లో తడబడేది.

కానీ గత ఏడాది చివర్లో వన్డే ప్రపంచకప్‌లో హర్మన్‌ప్రీత్ సేన ఎంత గొప్పగా ఆడి ప్రపంచకప్ గెలిచిందో తెలిసిందే. గతంలో ఆస్ట్రేలియా అంటే చాలు.. ముందే జావగారిపోయేవాళ్లు మన అమ్మాయిలు. కానీ ప్రపంచకప్ ముంగిట ఓ మ్యాచ్‌లో ఆ జట్టును 100కు పైగా పరుగుల తేడాతో ఓడించి సంచలనం సృష్టించారు. మరో మ్యాచ్‌లో 400 పైచిలుకు లక్ష్యం ముందున్నా.. విజయం కోసం గట్టిగా ప్రయత్నించారు. ఈ ఆత్మవిశ్వాసం, దూకుడే.. ప్రపంచకప్ సెమీస్‌లో కంగారూలపై 339 పరుగుల రికార్డు లక్ష్య ఛేదనతో చరిత్ర సృష్టించడానికి, దక్షిణాఫ్రికాపై ఫైనల్లోనూ గెలిచి ప్రపంచకప్ గెలవడానికి దోహదపడింది. అమ్మాయిల దృక్పథం, ఆటతీరులో ఇంత గొప్ప మార్పునకు డబ్ల్యూపీఎల్ ఓ ముఖ్య కారణం అనడంలో సందేహం లేదు.

ఉందిలే మంచి కాలం..: డబ్ల్యూపీఎల్‌లో ఇప్పటిదాకా మూడు సీజన్లు జరిగాయి. శుక్రవారమే నాలుగో సీజన్ ఆరంభం కాబోతోంది. మూడేళ్ల ముందుతో పోలిస్తే ఇప్పుడు లీగ్‌లో మార్పు స్పష్టం. భారత అమ్మాయిల ఆటలో వేగం పెరిగింది. ఆత్మవిశ్వాసం సంగతి చెప్పాల్సిన పని లేదు. డబ్ల్యూపీఎల్‌లో సత్తా చాటుకుని.. బిగ్ బాష్ లీగ్, ది హండ్రెడ్ లాంటి లీగ్‌ల్లోనూ మన అమ్మాయిలు ఎక్కువమంది ఆడుతున్నారు. ప్రతి సీజన్లోనూ కొత్త అమ్మాయిలు వెలుగులోకి వస్తున్నారు. ఇప్పటికే ఉన్న స్టార్ల ఆట కూడా మెరుగుపడుతోంది. హర్మన్‌ప్రీత్, స్మృతి మంధాన, షెఫాలి వర్మ, దీప్తి శర్మ.. అంతర్జాతీయ స్థాయిలో మేటి క్రికెటర్లుగా గుర్తింపు తెచ్చుకున్నారు. గత సీజన్ వరకు ఓ మోస్తరు స్థాయిలో ఉన్న జెమీమా రోడ్రిగ్స్ ఇప్పుడు పెద్ద స్టార్‌గా అవతరించింది. తెలుగమ్మాయి శ్రీ చరణి ప్రపంచ అత్యుత్తమ స్పిన్నర్లలో ఒకరిగా పేరు తెచ్చుకుంది. ఇంకా రేణుక సింగ్, క్రాంతి గౌడ్, రాధ యాదవ్, స్నేహ్ రాణా లాంటి క్రికెటర్లకు మంచి గుర్తింపే ఉంది.

రాబోయే కొన్నేళ్లలో మరెంతో మంది కొత్త అమ్మాయిలు వెలుగులోకి వస్తారని, భారత జట్టును బలోపేతం చేస్తారనే అంచనాలు ఉన్నాయి. విదేశీ క్రికెటర్లు కూడా డబ్ల్యూపీఎల్‌లో ఆడేందుకు అమితాసక్తి చూపిస్తున్నారు. వివిధ జట్లకు చెందిన అగ్రశ్రేణి క్రికెటర్లు లీగ్‌కు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారు. డబ్ల్యూపీఎల్ గురించి గొప్పగా మాట్లాడుతున్నారు. ప్రపంచకప్ విజయంతో సంతృప్తి చెందకుండా వివిధ ఫార్మాట్లలో నిలకడగా విజయాలు సాధించడం, అగ్ర జట్టుగా ఎదగడం, మరిన్ని ఐసీసీ టోర్నీల్లో గెలవడం భారత జట్టు తర్వాతి లక్ష్యాలు. ఆ లక్ష్యాలను అందుకోవడానికి డబ్ల్యూపీఎల్ ఉత్ప్రేరకంలా పని చేస్తుందన్నది విశ్లేషకుల మాట. డబ్ల్యూపీఎల్‌కు అంతకంతకూ ఆదరణ పెరుగుతుండడం.. భారీగా ఆదాయం వస్తుండడం.. వేలం ద్వారా అమ్మాయిలు కోటీశ్వరులవుతుండడంతో దేశంలో క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకునే అమ్మాయిల సంఖ్యా గణనీయంగా పెరుగుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. కాబట్టి రాబోయే రోజుల్లో డబ్ల్యూపీఎల్‌ను ఇంకా పెద్ద స్థాయిలో చూడబోతున్నామన్నది స్పష్టం.

## ఒక్కడు నిలిచాడు..



యాషెస్ సిరీస్‌ను విజయంతో ముగించాలన్న ఇంగ్లాండ్ ఆశ తీరడం కష్టమే. చివరి టెస్టులో ఆ జట్టుకు ఓటమి తప్పేలా లేదు. తొలి ఇన్నింగ్స్‌లో 183 పరుగుల భారీ ఆధిక్యం సంపాదించిన ఆస్ట్రేలియా.. నాలుగో రోజు ఆట చివరికి రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్‌ను 302/8కు కట్టడి చేసింది. జాకబ్ బెతెల్ (142 బ్యాటింగ్; 232 బంతుల్లో 15×4) గొప్పగా పోరాడుతూ అజేయంగా నిలిచినా.. మిగతా బ్యాటర్లలో ఎవ్వరూ కనీసం అర్ధశతకం కూడా సాధించకపోవడంతో ఇంగ్లాండ్‌కు ఇబ్బందులు తప్పలేదు. బెన్ డకెట్ (42), హ్యారీ బ్రూక్ (42) పర్వాలేదనిపించారు. ఆ జట్టు ప్రస్తుత ఆధిక్యం 119 పరుగులే. బెతెల్‌కు తోడుగా మాథ్యూ పాట్స్ (0) క్రీజులో ఉన్నాడు. చివరి రోజు ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌ను బెతెల్ ఎక్కడిదాకా తీసుకెళ్తాడో చూడాలి. ఆసీస్ బౌలర్లలో బ్యూ వెబ్‌స్టర్ (3/51), స్కాట్ బోలాండ్ (2/34) ఆకట్టుకున్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 518/7తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన కంగారూ జట్టు.. 567 పరుగులకు ఆలౌటైంది. వెబ్‌స్టర్ 71 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఇంగ్లిష్ బౌలర్లలో జోష్ టంగ్, బ్రైడన్ కార్స్ తలో మూడు వికెట్లు తీశారు.

బెతెల్ అద్భుత పోరాటం: తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యం కోల్పోయాక రెండో ఇన్నింగ్స్‌ను మొదలుపెట్టిన ఇంగ్లాండ్‌కు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ జాక్ క్రాలీ (1)ని స్టార్క్ (1/61) తొలి ఓవర్లోనే వికెట్ల ముందు బలిగొన్నాడు. అయితే మరో ఓపెనర్ డకెట్‌తో కలిసి జాకబ్ బెతెల్ ఇంగ్లాండ్‌ను ఆదుకున్నాడు. ఈ జోడీ రెండో వికెట్‌కు 81 పరుగులు జోడించింది. అయితే డకెట్, రూట్ (6) తక్కువ వ్యవధిలో ఔటైపోవడంతో 117/3తో ఇంగ్లాండ్ మళ్లీ కష్టాల్లో పడింది. ఈ దశలో బ్రూక్‌తో కలిసి మరో కీలక భాగస్వామ్యం (102) నెలకొల్పాడు బెతెల్. 219/3తో ఇంగ్లాండ్ మెరుగైన స్థితికి చేరుకుంది. కానీ వెబ్‌స్టర్.. ఒకే స్కోరు వద్ద బ్రూక్, విల్ జాక్స్ (0)లను ఔట్ చేసి ఆసీస్‌ను పైచేయిలో నిలిపాడు. కానీ బెతెల్ మాత్రం పోరాటం ఆపలేదు. జేమీ స్మిత్ (26) సహకారంతో అతను శతకం పూర్తి చేశాడు. స్మిత్ నిలకడగా ఆడుతుండడం, ఇంకా స్టోక్స్ కూడా బ్యాటింగ్‌కు రావాల్సి ఉండడంతో ఇంగ్లాండ్.. ఆసీస్ ముందు మెరుగైన లక్ష్యమే నిలుపుతుందనిపించింది. కానీ జేమీ స్మిత్, స్టోక్స్ (1) 3 పరుగుల వ్యవధిలో ఔటైపోవడంతో ఇంగ్లాండ్ ఆశలకు గండి పడింది. తర్వాత కార్స్ (16) అండతో బెతెల్ పోరాటం కొనసాగించాడు. ఆట చివర్లో కార్స్ కూడా ఔటైపోయాడు. వరుసగా మూడు టెస్టులు ఓడి సిరీస్‌ను కోల్పోయిన ఇంగ్లాండ్.. నాలుగో టెస్టులో విజయం సాధించిన సంగతి తెలిసిందే.

**సంక్షిప్త స్కోర్లు...**

ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్: 384; ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 567 (ట్రావిస్ హెడ్ 163, స్టీవ్ స్మిత్ 138, బ్యూ వెబ్‌స్టర్ 71, మార్నస్ లబుషేన్ 48, కామెరూన్ గ్రీన్ 37; జోష్ టంగ్ 3/97, బ్రైడన్ కార్స్ 3/130, బెన్ స్టోక్స్ 2/95); ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్: 302/8 (జాకబ్ బెతెల్ 142 బ్యాటింగ్, బెన్ డకెట్ 42, హ్యారీ బ్రూక్ 42, జేమీ స్మిత్ 26; బ్యూ వెబ్‌స్టర్ 3/51, స్కాట్ బోలాండ్ 2/34)